
ఆంధ్రసచిత్రవారపత్రిక


3-3-75

60 పైసలు














శ్రీ వాణీ ఆర్ట్ కంబైన్స్
పుట్టింటి గౌరవం
కథ - నిర్మాత:
స్క్రీన్‌ప్లే దర్శకత్వం:
ఎన్.వి.సుబ్బరాజు * పి.చంద్రశేఖరరెడ్డి B.A.,
మాటలు: మోదుకూరి జాన్సన్ B.A.B.L. * సంగీతం: సత్యం * ఫొటోగ్రఫీ: వి.వి.ఆర్.చౌదరి
కళ: బి.చలం * ఎడిటింగ్: నాయని మహేశ్వరరావు *
అన్నపూర్ణా ఫిలిమ్స్
ANNAPURNA
Rama Rao Arts



కర్ణాటక రాష్ట్రం లాటరీ
బహు పెద్ద బహుమతి
రు.5,00,000
2 కన్సొలేషన్ బహుమతులు
ఉగాది
గొప్ప డ్రా
13-4-1975
రు.18,77,160లు విలువ గలిగిన
8601 ఆశ్చర్యకరమైన బహుమతులు
6 ప్రథమ బహుమతులు
రు.1,00,000
12 కన్సొలేషన్ బహుమతులు
6 ద్వితీయ బహుమతులు
రు.10,000
12 కన్సొలేషన్ బహుమతులు
6 తృతీయ బహుమతులు
రు.5,000
12 కన్సొలేషన్ బహుమతులు
96 చతుర్థ బహుమతులు
రు.1,000
192 కన్సొలేషన్ బహుమతులు
192 పంచమ బహుమతులు
రు.500
384 కన్సొలేషన్ బహుమతులు
960 షష్ఠమ బహుమతులు
రు.100
1920 కన్సొలేషన్ బహుమతులు
4800 సప్తమ బహుమతులు
రు.50
బహు పెద్ద బహుమతి, మొదటి ఆరు బహుమతులు గెలుచుకున్న నెంబర్లకు ముందూ, వెనుకా వున్న నెంబర్లకు కన్సొలేషన్ బహుమతులు
మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్
MCA-MSIL-20



ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 - 1972)

శుక్రవారం : 28–3–'75
ఆనందనామ సం. ఫాల్గుణమాస బ. పాడ్యమి

సంపుటము : 68 సంచిక : 28

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

★

సంవత్సర చందా – రు. 33–80 పై.
ఆరుమాసాల చందా – రు. 16–90 పై.
విడిప్రతి వెల 60 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520003.

విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మలు :
ఫిలిం బ్యాలట్ విజేతలు

కథలు :

సీరియల్ కథలు :

వ్యాసాలు, శీర్షికలు :

మనలో మాట

1974 వ సంవత్సరంలో విడుదలైన చిత్రాలలో మా పాఠకులు "అల్లూరి సీతారామరాజు" ను ఉత్తమ చిత్రంగా నిర్ణయించారు.


వాణిశ్రీ


చంద్రకళ

ఏటా పాల్గొన్నట్లే యీ ఏడు కూడా ఫిలిం బ్యాలట్‌లో పాఠకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారి నిర్ణయాలు యీ క్రింది విధంగా వున్నాయి : ఉత్తమ నటుడు శ్రీ శోభన్ బాబు. ఉత్తమ సహాయ నటుడు శ్రీ చంద్రమోహన్.


రాజబాబు

ఉత్తమనటి : కుమారి వాణిశ్రీ. ఉత్తమ సహాయనటి : కుమారి చంద్రకళ. కాగా ఉత్తమ హాస్య నటునిగా శ్రీ రాజబాబు. అత్యధిక సంఖ్యలో పాఠకుల వోట్లు అందుకున్నారు.

ఉత్తమ దర్శకుడుగా శ్రీ దాసరి నారాయణ రావు ఎన్నికైనారు.


ఉత్తమ సంగీత దర్శకుడుగా యీ ఏడాది కూడా శ్రీ కె. వి. మహదేవన్ తమ స్థానాన్ని నిలుపుకున్నారు.

ఇక్కడ వీరి బొమ్మలతోపాటు ఉత్తమ చిత్రం నిర్మాత జి. హనుమంతరావుగారి బొమ్మ కూడా వేశాము. వీరందరికి మా అభినందనలు.


శోభన్ బాబు


చంద్రమోహన్

బ్యాలట్ విజేతలలో "తెరమీద" వారైన ఐదుగుర్ని ముఖపత్రం మీదనే పరిచయం చేశాము.


దాసరి నారాయణరావు


కె. వి. మహదేవన్


జి. హనుమంతరావు

తెరవెనుక వారిని యిక్కడ పరిచయం చేస్తున్నాము.

వీలునిబట్టి వీరితో చిన్న చిన్న యింటర్ వ్యూలు-మా పాఠకులకు ఉగాది సంచికలో అందజేస్తాము.

హైదరాబాద్ నోట్ బుక్

మంత్రి శ్రీ అంజయ్య హామీ :

చలనచిత్ర పరిశ్రమలో సిబ్బంది తగ్గింపు జరిగేట్లయితే ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకొంటుందని కార్మిక శాఖమంత్రి శ్రీ టి. అంజయ్య మార్చి 3 వ తేదీన శాసనసభలో ప్రకటించడం సంతోషకరమయిన విషయం. కాని, ప్రభుత్వానికి ఈ విషయంలో ఒక చిన్న సూచన చేయాలి. ప్రభుత్వం చిత్ర నిర్మాణానికి లక్షల కొలది ధన సహాయం చేస్తున్నది. స్టుడియోల నిర్మాణానికీ సహాయం చేస్తున్నది. ఈ రెండింటికీ బదులు ప్రభుత్వమే ఒక స్టుడియోను నిర్మిస్తే, చాల చిత్రాల నిర్మాణానికి దోహదమవుతుంది. వేలాది కార్మికులకు జీవిక అవుతుంది. మొదట్లోనే పూర్తిగా సర్వాంగ సుందరమైన, సమగ్ర సంపూర్ణమైన స్టుడియో అక్కరలేదు. మొదటి సంవత్సరం ఒక ఫ్లోరు, మరొక సంవత్సరం మరొకటి. ఇలా విస్తరింపజేయవచ్చు. వ్యక్తులకు స్టుడియో నిర్మాణానికి సహాయం చేసే ఆ వ్యక్తులు తమకు ఇష్టమైన తమ అదుపులోని డిస్ట్రిబ్యూటర్లకు చిత్రాలిచ్చే వారి నిర్మాణ కృషికే అవకాశమివ్వ వచ్చు. కనుక ప్రభుత్వమే స్టుడియో నిర్మిస్తే, అన్ని వర్గాల నిర్మాతలకూ అవకాశం వుంటుంది. కాల్‌షీట్లకు కొదవవుండదు ఖాళీ అన్నది వుండదు.

శ్రీ కాళూరి వ్యాసమూర్తిగారి కాలధర్మం:

సుప్రసిద్ధ విద్వద్విమర్శకులు శ్రీ కాళూరి వ్యాసమూర్తిగారు ఫిబ్రవరి 25 న ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో మరణించారు. వీరి వయస్సు 70 సంవత్సరాలు. వీరికి నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. వీరి కుమారులలో ఒకరు శ్రీ కాళూరి హనుమంతరావు. కాలేజీ అవ్ టెక్నాలజీలో ఉపన్యాసకులు. సంస్కృతాంధ్రాలలో చాల రచనలు చేశారు. శ్రీ వ్యాసమూర్తిగారు తిక్కన కళాసామ్రాజ్యం మూడు భాగాలు, భారతామృతరసం నాలుగు భాగాలు, రామరాజ్యం కుశలవులు, మహాభారత తత్వార్థ నిరూపణం మొదలయిన పదిపన్నెండు గ్రంథాలు, ద్వైత వేదాంతంలో గ్రంథాలు రచించారు.

ఉస్మానియా యువజనోత్సవం :

ఉస్మానియా విశ్వవిద్యాలయం యువజనోత్సవం ఫిబ్రవరి 27 న రవీంద్రభారతిలో వైస్ ఛాన్సలర్ శ్రీ పింగళి జగన్మోహనరెడ్డి అధ్యక్షతన వైభవంగా జరిగింది. ముఖ్య అతిథి అయిన పద్మశ్రీ ఎన్. టి. రామారావు, ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు విద్యార్థులకు ఉత్సాహంతో పాటు క్రమశిక్షణ అవసరమన్నారు. వినోద కార్యక్రమంతో ఉత్సవం సమాప్తమైంది.

సి. నా. రె. కుమార్తె వివాహం :

సుప్రసిద్ధ కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి జ్యేష్ఠ పుత్రిక గంగాదేవికి, భాస్కరరెడ్డికి ఫిబ్రవరి 27 న లేడీ హైదరీ క్లబ్బులో మహా వైభవంగా జరిగింది.

(34 వ పేజీ చూడండి)

జీవిత [వి] చిత్రం

వి. వి. బి. రామారావు

"జీవితం విచిత్ర సంఘటనల వింత గొలుసు. నథింగ్ ఈజ్ ఇంపాసిబుల్. కాని కొన్ని సంఘటనలు మాత్రం కేవలం ఏబ్సర్డ్."

టీ కప్పు చేత్తో పట్టుకొస్తున్న నన్ను చూసి లెక్చరు ప్రారంభించారు శ్రీవారు. ఆయన కళ్లల్లోకే చూస్తూ టీ కప్పు టేబిల్ మీద పెట్టాను.

ఆయన కుర్చీలోంచి లేచి కిటికీవద్దకు వెళ్లి, తల వేడెక్కిపోయిందేమో, చల్లటి కిటికీ ఊచలమీద నుదురు ఆనించి వర్షం వేపే చూస్తున్నారు.

ఖాళీ అయిన వెచ్చటి కుర్చీలో కూచున్నాను. కిటికీవైపు నుండి టేబిల్ మీదకు దృష్టి మళ్లించాక ఆయన రాయడం పూర్తి చేసి జెమ్‌క్లిప్ పెట్టిన కాగితాల బొత్తి కంటపడింది.

తీసి చదవడం ప్రారంభించాను.

* * *

వెంకట్రామయ్యగారు బోల్డు సంబరపడిపోయి, బజారుకు బయలుదేరినాయన హుటాహుటి ఇంటి కొచ్చేశారు "ఓయ్" అంటూ లోపలకి కేకేస్తూ.

"ఏం నాన్నా!"

స్వయంకృషితో బ్రతుకు పూలబాట చేసుకుందామనే తపన, స్వయం ప్రతిభతో కత్తిరిద్దామనుకుంటున్న లేటెస్ట్ ఫేషన్ బ్లవుజూ అలమారాలో పడేసి సావిట్లోకి వచ్చింది, అభ్యుదయ భావాలున్న పెళ్లీడు పిల్ల ఉషారాణి.

"అమ్మను పిలువ్!"

గోడనున్న పంచాంగం కేలెండరు తీసి కుర్చీలో చేరగిలబడ్డారు వెంకట్రామయ్యగారు.

"ఏమిటండీ హడావుడి? బజారు కెళ్లలా?" పైటచెంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చింది కామాక్షమ్మగారు.

"అమ్మాయ్, కాస్త నిమ్మకాయ రసం కలిపిపట్టుకురా!"

ఉషారాణి సొంతం లోపల కెళ్లిందనుకున్నాక అసలు విషయం ప్రస్తావించారు.

"మీ అన్నయ్య దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. ఇదిగో చూడు."

"ఉత్తరం నాకెందుకండీ, అంతా కులాసాయేనా? ఏమిటి విశేషాలు?"

"వెర్రిమొద్దా. ఉషకి మంచిసంబంధంవట. కాకినాడే; కాస్త పొలము, ఓ డాబా ఉన్నవాళ్లేనట. యమ్. కామ్ ప్యాసయ్యాడట. నాలుగూ మాటాడుకోవచ్చు, పిల్లాణ్ని చూశాక. ఓవారం రోజులపాటు తీరిక చూసుకుని రమ్మన్నాడు. రేపు పంచమి భేషుగ్గా ఉంది. నువ్వూ వస్తావా?"

"నేనెందుకండీ, మీరు వెళ్లిరారాదూ?"

"శకున పక్షీ నువ్వెప్పుడూ ఇంతే. మీ అన్నయ్యకు మన స్థితిగతులు తెలియవా ఏం? కావడానికి వీలులేని సంబంధం మన కెందుకు చెబుతాడూ?"

"ఏమో తెద్దురూ, ముందు మీరే వెళ్ళి రండి."

కామాక్షమ్మ మనసులో ఉద్దేశం వెంకట్రామయ్యకు తెలియనిదికాదు. ఆడవాళ్లు వెడితే కట్నకానుకలూ, తర్జన భర్జనలూ పెళ్లికొడుకు అక్షతలనుబట్టి కనీసం పది వేలైనా అడిగేటట్టుంది. ఇంతకీ కుర్రాడి ఉద్యోగం ఏమిటో... సరియైన ఉద్యోగం అయితే ఉన్నకొంప కాస్తా కరిగించైనా ... పెళ్లికి డబ్బు ఎలా ఏర్పాటు చెయ్యాలా అని ఆలోచనలో పడ్డాడు వెంకట్రామయ్య.

పంచమి నాటికి చేరాడు కాకినాడ.

బావమరిది ప్రయివేట్ ప్రాక్టీస్‌లో చాలా బిజీగా ఉన్నాడు. వీధిగదినిండా విద్యార్థులు— అతను మాటాడుతున్నది తెలుగైనా వెంకట్రామయ్యకేం తెలిసి చావడంలేదు. తనూ చదివాడు ఆర్థిక శాస్త్రం, ఏం లాభం?

సుందర్రావు ఆర్థికశాస్త్ర విభాగంలో ఉపన్యాసకుడు. మంచిఫైలూ, పలుకుబడీ ఉన్నవాడు. ప్రయివేట్ ప్రాక్టీస్ ప్రతిఫలంగా ఓ యాభైవేల నగదూ, ఓ మేడా, సంపాయించాడు.

రాత్రి ఎనిమిదయింతర్వాత పూర్తయ్యింది హోమ్ వర్క్ సుందర్రావుకి. భోజనాల గదిలో పెళ్లి విషయం ప్రారంభించాడు.

"మీ అన్నయ్యేం చేస్తున్నాడోయ్?" అని అడిగాడు, ఆ వేణు మాధవరావుగారి అబ్బాయిని."

ఏ విషయాన్నైనా పూసగుచ్చినట్టు వివరంగా చెప్పడం సుందర్రావు స్ట్రాంగ్ పాయింట్. కుర్రాళ్ళు కాలేజీలో క్లాసులకి రాకపోయినా, ఇంటిదగ్గరకొచ్చి దొంతులిచ్చి నేర్చుకుపోతుంటారు ఆర్థికశాస్త్రమంతా ముక్తసరిగా ముప్పై టాపిక్స్‌లో.

వెంకట్రామయ్య చేతిలోనిముద్ద చేతిలోనే ఉంది. కళ్లు పెద్దవి చేసుకుని చూస్తున్నాడు.

"మొన్ననే ఎమ్.కామ్. ప్యాసయ్యాడు సార్. ఇంకా ఉద్యోగమేమీ దొరకలేదు" అన్నాడు చిరంజీవి."

"నీకంటె ఎంత పెద్దంటావ్?" మెల్లగా కూపీ తీశాను.

సుమారు ఇరవైనాలుగేళ్లవాడు. నాకు వాళ్ల నాన్నగారిని బాగాతెలుసు. ఆ కుర్రాడు అరవై తొమ్మిది, డెబ్బైలో బి. కాం చదవడం నాకు తెలుసు. అరవై ఎనిమిది ఇంటర్ కాలేజియేట్ డిబేట్స్‌లో..."

సుందర్రావు జ్ఞాపకాలు ఇంకా లోతుకు పోకుండానే తరువాత ప్రశ్న వేశారు వెంకట్రామయ్యగారు, తన నలభై సంవత్సరాల మేష్టరీలో ఆర్జించుకున్న ఆక్యుపేషనల్ డిసీజ్—విసుగు—ను అతికష్టంతో కప్పిపుచ్చుతూ.

"అయితే సుందర్రావ్, నువ్వన్న వేణు మాధవరావుగారు ఏం చేస్తుంటారు?"

"స్టేట్ బ్యాంక్‌లో పనిచేస్తుండేవారు. ఈ మధ్య రిటైరై ఈ ఊళ్లోనే స్థిరపడిపోయారు. చాలా పెద్ద ఆఫీసర్. ఒకసారి హైదరాబాదులో కనపడి..."

"కుర్రాడు ఏం చేస్తున్నాడన్నావ్?" ఆతృతతోఉన్న పెళ్లికూతురు తండ్రి మళ్లీ ఆపవలసి వచ్చింది.

"ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాడు. యం.కామ్ పాసయ్యాడని వ్రాశానుగా. ఇక్కడ కాలేజీలో చదువుకుంటున్నప్పటినుంచీ చురుకుగా డిబేట్స్‌లోనూ, ఎలక్యూషన్స్‌లోనూ, పాల్గొంటూ ఉండేవాడు. మంచి ప్రోగెసివ్ వ్యూస్ ఉన్నవాడు."

"కుర్రవాడెలా ఉంటాడు?"

"సన్నగా, పొడుగ్గా, చామన చాయగా— హిప్పీజుట్టు, బెల్ బాటమ్స్, అన్నీ ఆధునిక యువకుల లక్షణాలే."

— ఇదట్టే నచ్చినట్టు లేదు హైస్కూలు మాష్టరుగా రిటైరైన పాతకాలం వెంకట్రామయ్యగారికి.

"నువ్వు ఈ సంబంధం గురించి వేణు మాధవరావుగారితో చెప్పావా ?"

"అబ్బే, ఇంకా లేదు. చెబుతున్నాగా, నువ్వు సొంతం చెప్పనిస్తేనా!" పెళ్ళికొడుకు తమ్ముడుద్వారా విషయాలన్నీ తెలుసుకున్నాను. మనం వాళ్ళఇంటికి వెళ్ళి నాలుగూ మాటాడుకుని వద్దాం."

వెంకట్రామయ్యగారి ముఖ్య సందేహం నివృత్తి కాలేదు. మర్నాడు పొద్దున్నే బావా మరుదులిద్దరూ వేణుమాధవరావుగారి ఇంటికి వెళ్ళారు.

ఇల్లు చూడగానే వెంకట్రామయ్యగారికి సంబంధం నచ్చినట్టే ననిపించింది. హాల్లో పెద్ద వెంకటరమణమూర్తి పటం. పెళ్ళి కొడుకు చురుకుగా ఉన్నాడు. కుర్చీలో కూచున్న కుర్రాడు వచ్చే పెద్ద మనుషులను ఆహ్వానించాడు లోపలికి.

"మాష్టారూ, నమస్కారం, రండిసార్ రండి. నాన్నగారు లోపల పూజ చేసుకుంటు న్నారు. వచ్చేస్తారు."

"మీ తమ్ముడేం చేస్తున్నాడోయ్ ?" కలుపుగోలు ప్రశ్న వేశారు మాష్టారు.

"పొద్దున్నే ట్యూషన్‌కు వెళ్ళాడు సార్!"

కొద్దిసేపట్లో వేణు మాధవరావుగారు ఇవతలకి వచ్చారు.

సుందర్రావు ప్రారంభించాడు తన క్లాస్ రూమ్ ఫారమ్‌లో.

"వీరు మా బావగారు, వెంకట్రామయ్య గారు. విజయవాడలో ఉంటున్నారు. నలభై ఏళ్ళు హైస్కూల్లో పనిచేసి రిటైరయ్యారు. మద్రాసులో పచ్చయప్ప కాలేజీలో బి. యే. పాసయి, యల్. టి. చదివారు. ఆ రోజుల్లో ఇంగ్లీషు బి. య్యే. పది హేనేళ్ళు హెడ్ మాస్టర్ పనిచేశారు. ఆ రోజుల్లో..."

వెంకట్రామయ్యగారు కుర్చీలోంచి ముందుకు వంగేనుకునీ మళ్ళీ చేరబడి పోయారు.

ఫించను పుచ్చుకున్న స్టేట్‌బ్యాంక్ ఏజంటుగారు ఓపికగా వింటున్నారు. ట్రేతో కాఫీ కప్పులు పట్టుకొచ్చాడు పెళ్ళికొడుకు.


"అయ్యా. మా బావగారి కడసారపు కూతురు, యంగెస్ట్ డాటర్, పెళ్ళికి ఉంది. మీ అబ్బాయికి ఇవ్వాలని మా సంకల్పం. మనకూ మనకూ చాలా రోజులుగా పరిచయం ఉంది. ఉభయుల సాంప్రదాయాలూ కలుస్తాయి. మీరు అవునంటే అమ్మాయిని తెచ్చి ఈ ఊళ్ళోనే చూపించాలను కుంటు న్నాము."

సుందర్రావు ఆశ్చర్యకరంగా ప్రస్తుతంలోకి డ్రైవ్‌చేసి, ఆట్టే పూసలు గుచ్చకుండా వచ్చినపనిని వివరించాడు.

"చూడండి మాష్టారూ, ఈ కాలం కుర్రాళ్ళకు మనం చెప్పవలసిందేమీ లేదు. మా వాడికి ఈ వయసులో పెళ్ళి చేయాలనే మా కోరిక. అబ్బాయి ఇక్కడే ఉన్నాడు కదా! మీరే అడగండి. ఏంవోయ్, మాష్టారు చెప్పిన మాటలు విన్నావుకదా, ఏమంటావ్ ?"

"మాష్టారూ మొన్న దీపావళికి మీఇంటికి వచ్చిన అమ్మాయేనా, పెళ్ళికూతురు ?"

—వెంకట్రామయ్యగారు ఆశ్చర్యపోయారు.



ఉషారాణి దీపావళికి మామయ్యగారింటిదగ్గరే ఉంది. అయినా ఈ కుర్రవాడికెలా తెలుసు— 'ఈ కాలం పిల్లలు' అని సరిపుచ్చుకున్నాడు.

పెద్ద మాష్టారి ఆలోచనలు తెలుసుకున్నట్టు అన్నాడు పెళ్ళికొడుకు "మాష్టారూ, మీతో ఫ్రాంక్‌గా మాటాడుతున్నాను. మరోలా అనుకోకండి. చిరంజీవి కోసం ఓ రోజు మీ ఇంటికి రావలసివచ్చింది... నేను వచ్చేసరికి ట్యూషన్ అయిపోయింది. బెల్ కొట్టగానే ఓ అమ్మాయి వచ్చి తలుపు తీసింది. మీకు ఆడపిల్లలు లేరని నాకు తెలుసు వెనక్కు తిరిగి వచ్చినతరువాత చిరంజీవి వల్ల తెలుసుకున్నాను వివరాలన్నీ..."

కొత్తకాలం నవల చదువుతున్నట్లనిపించింది పెద్ద మాష్టారికి మరి ఈ సంబంధం గురించి సుందరరావు ప్రస్తావించినప్పుడు చిరంజీవి చనువుగా, ఇండయిరెక్టుగా, తన అన్నయ్య ఈ సంబంధం ఇష్టపడినట్టు చెప్పాడా?

అవకాశాన్ని గమనించిన సుందరరావు వెంటనే అందుకున్నాడు: 'మీరు చూస్తామంటే అమ్మాయిని తెప్పిస్తాం."

"మేం చూసేదేముంది పిల్లవాడికి ఇష్టమయిన తరువాత? ఇంతకీ మాకు కావలసింది సంప్రదాయం. పిల్ల బుద్ధిమంతురాలై అణకువగా ఉండడం."

"...అమ్మ చూసానంటోంది"

వెంకట్రామయ్య సుందరరావూ, ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

"అది సరే, మరి ముహూర్తం..." అర్థోక్తిలో వదిలేశారు పెద్ద మాష్టారు అసలు విషయాన్ని ఎలిసిట్ చేయడానికి వేయబోయే

జీవిత [వి] చిత్రం

ప్రశ్న.

"అది మీ ఇష్టం సార్. నా మనసులో మాట చెబుతున్నాను. కట్నాల విషయంలో మా ఇంట్లో అందరికీ నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయ్. మేం కట్నాలు ఇచ్చే అవసరం లేదు, నాకు సిస్టర్స్ లేరు కాబట్టి. ఇకనేం పుచ్చుకోవడమా, దేవుడి దయవల్ల మాకు సరిపోయేటంత మా దగ్గర ఉంది. కట్నాలు పుచ్చుకోవడం సాంఘికంగా మనమంతా కలిసి నిర్మూలించవలసిన దురాచారం!"

డిబేట్ ధోరణిలో వెళుతున్న కుర్రాడిని అలా చూస్తున్నాడు సుందరరావు అబ్బాయి మీద అప్పుడే విపరీతమైన అభిమానం పుట్టుకొచ్చింది పెద్ద మాష్టారికి.

"ముహూర్తం విషయం, నాకు ఉద్యోగం అయిన తరువాత ఎప్పుడు పెట్టినా నాకు అభ్యంతరం లేదు."

"అదేమిట్రా అలా అంటావ్. మీ అమ్మ చెప్పినట్టు ఇష్టమైన అమ్మాయి దొరికినప్పుడు పెళ్ళిచేసుకో, దొరికినప్పుడే చేద్దువు కాని ఉద్యోగం!"

"కాదు నాన్నగారూ, ఉద్యోగం అయితే కాని చేసుకో కూడదనుకున్నాను. అది నా నిర్ణయం."

—వెంకట్రామయ్యగారు దీర్ఘాలోచనలో పడ్డారు.

"సరే శెలవ్, అమ్మాయిని వచ్చేవారంలో తెప్పిస్తాను మీ దర్శనం మళ్ళీ చేస్తా" అంటూ శెలవు తీసుకున్నాడు సుందరరావు.

ఇద్దరూ ఇవతలకొచ్చారు.

"ఫస్ట్‌క్లాసయిన సంబంధం దొరికిందోయ్, అమ్మాయికి" సుందరరావు భలే హుషారుగా అన్నాడు. తల వంచుకుని నడుస్తున్న వెంకట్రామయ్యగారు మనసులోని ఆలోచనలను పైకి తేల్చారు.

"ఓ విషయం ఆలోచించావా, అబ్బాయికి ఉద్యోగం అయేవరకు చేసుకోనన్నాడు. మరి ఉద్యోగం సంగతి ఎవరు చెప్పగలరు? మనమేం చెయ్యగలం? ఈ అబ్బాయి కోసం అమ్మాయిని అలానే ఉంచుతామా, మరో సంబంధం చూస్తామా?"

"ఇంతకీ అమ్మాయికి అబ్బాయి నచ్చాలిగా, నువ్వెళ్ళి ఓసారి తీసుకురా"

"తీసుకొస్తా సరే, మరి ఉద్యోగం?".

"అంతా యోగం బావా. అన్నీ అవే కలిసివస్తాయ్, యోగం బాగుంటే ..."

ఆలోచనతో సతమతమౌతూ సాయంకాలం ఆఖరి బస్సులో తిరుగు ప్రయాణం కట్టారు మాష్టారు.

రైళ్ళ స్టాయికు మెల్లగా ఓ టిక్కెట్టు దొరికింది. బస్సులో కూచున్నారు మాష్టారు. కాసేపు అయాక తన పక్కనే ఓ బట్టతలాయన కూర్చున్నాడు — కూచుంటూనే "నమస్కారం" అన్నాడు.

బస్సు బయలుదేరింది. బాగా చీకటి పడింది.

"జ్ఞాపకం ఉన్నానా మాష్టారూ?"

"లేదుబాబూ, మరేమీ అనుకోకండి, పెద్దవాడినయానుకదా!"

"ఎంతమాట మాష్టారూ, నాలాంటి వాళ్ళు మీ దగ్గర ఎంతమంది చదువుకున్నారో

జీవిత [వి] చిత్రం

నేనుమాత్రం మిమ్మల్ని ఎప్పుడూ మరచి పోలేను.''

బట్టతలాయన మనసు గతంలోకి పోయింది.

వెంకట్రామయ్యగారంటే స్కూల్లో పిల్లలందరికీ భయమే. ఎంత బాగా పాఠం చెప్పేవారో అంత స్ట్రిక్ట్‌గా ఉండి పిల్లలందరినీ డిసిప్లిన్‌డ్‌గా ఉంచేవారు. తను ఆ ఇంటా, ఈ ఇంటా తినీ చదువు సాగించాడు. అతి చిన్నవయసులోనే తల్లినీ దండ్రినీ గోల్పోయిన మందభాగ్యుడు. తనకు ఓ వారం ఇవ్వడమేకాక, బడి జీతానికి డబ్బులు చాలక పోతే పోనీలేరా గోపాలం, కష్టపడి చదువుతున్నావ్, ఈనెల జీతం నే కట్టేస్తాలే, నీ దగ్గరున్న డబ్బు వచ్చేనెలకు దాచుకో'' అనేసేవారు.

మాష్టర్ని చూసి ఎన్నాళ్లయిందో! తనెవరో చెప్పకుండా ఎలా ?

''మాష్టరూ !''

అప్పుడే కునుకు పడుతున్న వెంకట్రామయ్యగారు మెల్లగా కళ్లు విప్పారు. ఆవులింతతోపాటు వళ్లు విరుచుకుంటూ చేతులు పైకెత్తారు.

మీద నుండి ఓ సూట్‌కేస్ మీదపడింది. అదే క్షణంలో బస్సు రోడ్డు దిగి ఓ పెద్ద చెట్టుని ఢీకొని ఆగిపోయింది. తను చేతులెత్తకపోతే బట్టతలాయనకు తల పగలవలసిందే. యాక్సిడెంటయినా అదృష్టవశాత్తూ పెద్ద దెబ్బలేవరికీ తగలలేదు. బస్సు మాత్రం మళ్లీ కదిలేటట్టు లేదు.

ప్రయాణీకులంతా బస్సు దిగి తమ తమ అదృష్టాలను అభినందించుకుంటున్నారు. చావవలసింది, బ్రతికున్నామే అని. కొందరు డ్రైవరు ప్రతిభను మెచ్చుకుంటున్నారు.

''స్టీరింగ్ ఫెయిలయ్యిందట—ఇంకానయం చెట్టు మనల్ని రక్షించింది'' అన్నాడు కాస్త డ్రయివింగ్ విషయం తెలిసినవాడు. మరో బస్సుకోసం కబురు పంపడం జరిగింది.

''మాష్టరూ, అలా వెళ్లి ఆ సిమ్మెంటు దిమ్మ మీద కూచుందాం రండి'' బట్టతల తడుముకుంటూ అన్నాడు గోపాలం.

''సరే పదండి.''

రోడ్డుమీద నుండి మెల్లగా నడుస్తున్నారిద్దరూ.

''నేను గోపాలాన్ని మాష్టారూ!''

''ఆఁ గోపాలమా, మా స్కూల్లో చదివావ్ కదోయ్. ఏంతవాడివయ్యావ్, నువ్వు జ్ఞాపకంలేక పోవడమేం, నేను నిన్ను గుర్తుపట్టలేక పోయాను కాని. నేనూ కామాక్షీ నిన్ను తలుచుకొంటూనే ఉంటాం. బాగా మారిపోయావ్ సుమా !''

''నన్నోమనిషిని చేశారు మాష్టారూ ! మీ మేలు మరచి పోలేను—ఈరోజు మీరు చేతులెత్తకపోయి ఉంటే ఆ పెట్టె నా నెత్తిన పడేది.''

''బాబూ, అంతాయోగం, అంతా దైవేచ్ఛ, మనమేంచేసే వాళ్ళం కాదు.'' పాత రోజుల గురించి కబుర్లు ప్రవాహంలాసాగిపోతున్నాయ్. గోపాలం తక్కున ప్రస్తుతంలోకి వచ్చాడు.

''మాష్టరూ, పిల్లలంతా కులాసా?''

''కులాసాయే నాయనా, పెద్ద పిల్లలిద్దరూ కాపురాలు చేసుకుంటున్నారు. చిన్నది పెళ్లికుంది. దాని సంబంధం విషయమై కాకినాడ వచ్చాను. సంబంధం నాకు నచ్చింది. వేణు మాధవరావు గారని, వారబ్బాయి. యం. కామ్ పాసయ్యాడు కుర్రాడు. యోగ్యుడు. అయితేనేం, ఉద్యోగం అయితే కాని చేసుకోనంటున్నాడు.''

''వేణుమాధవరావు గారంటే రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ ఏజంటేనాండి ?''

''ఆఁ ఆయన నీకు తెలుసా ?''

''అయ్యో వారిని తెలియక పోవడమేం ? రామారావ్‌పేటలో ఉంటున్నారు. ఆయన దగ్గర నేను కొద్ది నెలలు ప్రొబేషనర్‌గా పని చేశాను—అప్పట్లు మరిచిపోయాను, ఈ మధ్య వారబ్బాయి ఉద్యోగానికి పంపిన దరఖాస్తు నా దగ్గరే ఉంది. నేను పెర్సనల్ ఆఫీసర్‌గా ఉంటున్నాను. చాలా తొందరలో ఆయనకు ఉద్యోగం వచ్చేస్తుంది మాష్టారూ, మంచి మార్కులొచ్చాయి. పెళ్లికి తప్పకుండా వస్తా మాష్టారూ నేను ఇప్పుడు హైదరాబాదులోనే ఉంటున్నా. నా పేరు రాసి స్టేట్ బాంక్ అంటే వచ్చేస్తుంది ఉత్తరం.''

మాష్టారు చాలా సంతోషించారు. హడావిడిగా ఇంటికి చేరారు.

రిక్షా వీధి మలుపు తిరుగుతుంటే ఎడమవైపు ఇంటిలోంచి కుడివైపు ఇంటిలోకి ఆదరా బాదరా పరిగెత్తింది ఓ నల్లపిల్లి.

శకునంతో ఏం సంబంధం, వెళ్లినపని సొంతం పండేకదా అని తృప్తిగా ఊపిరిపీల్చు

కున్నారు మాష్టారు. కాని తలుపు తీయడానికి వచ్చిన కామాక్షమ్మ భర్తనుచూసి బావురు మందిఆమె తెల్లారిలేచి చూసేసరికి అమ్మాయి మంచం ఖాళీ.

కన్నీటిబొట్లతో తడిసిన ఉత్తరం ఆమె దగ్గర పుచ్చుకుని కుర్చీలో కూలబడ్డారు మాష్టారు.

"అమ్మా,

నీ మనసు, నాన్నగారి మనసు కష్ట పెట్టడం నా ఉద్దేశం కాదు. నాన్నగారూ, నువ్వూ నన్నెంత ప్రేమగా పెంచారో నాకు తెలుసు. నాన్నగారి స్థితిగతులు నాకు తెలియనివి కావు. ఇంత చదువూ చదివి, ఇంతదానినై, నీ గుండెలమీద కుంపటినై, నాన్నగారికి గుదిబండనై ఇక్కడ బ్రతకలేను. నా పెళ్లికి కట్నం ఎక్కడనుండ తెస్తారు, అలాగని తల పెట్టడమూ మానరు. ఇల్లు అమ్మేసి ఎక్కడుంటారమ్మా ! — ఆడపిల్ల నైనా, మొగపిల్లాడిలా ఆదుకుంటా మిమ్మల్ని

నా స్నేహితురాలు సునంద లేదూ, నీకు జ్ఞాపకం లేదేమో, యస్సెల్సీ వరకూ చదువు కున్నాం ఇద్దరమూ, వాళ్లాయన నాకు ఉద్యోగం వేయిస్తావన్నారట. మద్రాసు వెళుతున్నాను. నాకోసం మీరేమీ బెంగ పెట్టుకోవద్దు. ఏ అఘాయిత్యానికీ ఒడి కట్టుకోనని, అమ్మవి, నీకు తెలీదూ !

నాన్నగారికి నా నమస్కారాలని చెప్పు.

ఉషారాణి.

పెద్ద మాష్టారు వెంకట్రామయ్యగారు కుర్చీలోంచి లేవనూ లేదు, ఆయన నోటివెంట మాట రానూ లేదు.

* * *

"యూ, యూ, యూ ఆర్ క్రూయల్."

గట్టిగా అరిచేసాను. నావైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు శ్రీవారు.

టేబిల్ మీద నిండుగాఉన్న టీ కప్పు కనపడింది. టీ అయిస్‌లా అయిపోయి ఉండాలి. నా ఏకాగ్రత భంగం చెయ్యకూడ దన్నట్టు ఇంతసేపూ కిటికీదగ్గరే నిలబడి ఉన్నారు ఆయన.

ఇట్ ఈజ్ ఫన్నీ, నో ఇట్ ఈజ్ ఎబ్సర్డ్.

ఫాలాక్షుని డైరీ

వైద్యవిద్యార్థియా ? రోగియా ?

విశాఖపట్టణంలో వైద్య శాస్త్రం మూడో ఏడాది చదువుతున్న ఒక ఆయన పదో క్లాసు చదువుతున్న ఓ అమ్మాయిని చెరచ ప్రయత్నించినందుకు కోర్టు ఆతనికి పదిరోజుల శిక్ష విధించారట. ఆమె ఒంటరిగా వెళ్తుండగా వెనుకనుంచి పట్టుకుని బలాత్కారించబోయాడని పోలీసు కథనమట.

అబలా ? కాదుకాదు...

జపాను ప్రధాని గొంతును యధాతథంగా పుణికిపుచ్చుకుని, టోక్యోలో 38 ఏళ్ల పనకోసకల్ అనే ఒకామె ఓ కోటీశ్వరుని వద్దనుంచి ఎన్నికల కోసంగా నాలుగులక్షల ముప్పయివేల స్టెర్లింగులు కాజేసిందట. ఈమె జపాను మాజీ ప్రధాని మిస్టర్ "కాకూయ్ తనాకా" గొంతు యధాతథంగా అనుకరిస్తూ ఆ కోటీశ్వరునకు సుమారు ముప్పయి సార్లయినా టెలిఫోను చేసిందట. ఈనాడీయనకి డబ్బిస్తే భవిష్యత్తులో ప్రభుత్వపు ఋణాలపేర మరింత రాబట్టుకోలేమా ఏమిటని ఆ కోటీశ్వరుడు డబ్బు యిచ్చేశాడట అహో ! స్త్రీలు అన్నిటా చూస్తుండగానే పురుషుణ్ణి మించిపోతూనే వున్నారే ?

కీర్తిశేషురాలంటే ఇదే !

"ఇంటర్నేషనల్ ఉమన్స్ ఇయర్" వేడుకల కమిటీ ఏర్పాటు సందర్భంలో కేరళలో ఎనిమిది సంవత్సరాల క్రితమే చనిపోయిన మందేరి కుమలమ్ అనే ఆవిడను సభ్యురాలిగా ఎన్నిక చేశారట. తీరా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాక తెలిసిందటావిడ చనిపోయి చాన్నాళ్ళయ్యిందని, కేరళ ముఖ్యమంత్రి చైర్మను, విద్యామంత్రి ఉపచైర్మనుట దీనికి—వేష్ !

మరి ఎవరిపని ?

"బిల్లలు తుడవడం మా పనికాదు" అని బొంబాయి రిజర్వు బ్యాంకులో ప్యూనులు (క్లాస్‌ఫోర్ ఆఫీసర్లు) అని ఆ పని చేయకుండా వూరు కున్నందువల్ల మిగతా పనులన్నీ కూడా స్తంభించి పోయాయట. జీతాలు పెంచాలని, వాటితో ఏవో మరిన్ని కోర్కెలు కూడా తీర్చాలని మొన్నామధ్య వరకూ రిజర్వు బ్యాంకు క్లాస్ వన్ అధికారులు (అనగా ఎవరు) సమ్మెచేసి ఇప్పుడిప్పుడే పూరట చెందుతున్నారు.

నమ్మూ నమ్మకపో !

సోవియట్ దేశంలో ఓ చోట నూనె బావులు త్రవ్వుతూ 1100 మీటర్ల లోతుకు పనివారు పోయేసరికి అక్కడవారికో బల్లి దర్శనమిచ్చిందట. ఆ బల్లిని శాస్త్రజ్ఞులు పరిశీలించి అది 200 మిలియను సంవత్సరాల క్రితం పుట్టిన బల్లిగా తేల్చారట-బాబోయ్ !

గజరాజుల పాట్లు

తమిళనాడు రాష్ట్రంలో నీటికరువు తాండవించిందట. హొగినక్కల్ జలపాతంవద్ద ఏనుగులు నీటికోసం గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయట. హొగినక్కల్‌వద్ద కావేరి నదిలోనె కొంచెం నీళ్ళున్నాయని, ఆ నీటికోసం అడవిఏనుగులు పెన్నాగర్నమ్ ప్రాంతానికి కూడా వచ్చి హొగినక్కల్ వెళుతున్నాయని, అయితే ఆ గుంపులింతవరకూ జనం జోలికి పోలేదని, ధర్మపురి కలెక్టరన్నారట.

పాలిచ్చే కొత్తమార్గం

పురుష సంపర్కం, గర్భధారణ, ప్రసవం...వీటి సంబంధం లేకుండానే ఆడ జంతువులు పాలు ఇవ్వగలవని, విజ్ఞానశాస్త్ర పరిశోధన ఫలితమేయిదని, త్రిచూరు మనుతిని చెందిన కేరళ ఎగ్రికల్చరల్ యూనివర్సిటీ ప్రకటించిందట. మేకలకు హార్మోనులు ఇంజక్షనుద్వారా పంపి డాక్టరు పవిత్రన్, డాక్టర్ సుకుమారన్ చేసిన ప్రయోగాలు సత్ఫలితాలనిచ్చాయట. ఈ రకంగా పాలివ్వటం ప్రారంభించిన మేకలు రెండేళ్ళ పాటిస్తాయని వారు ఋజువు చేశారట. తస్మాత్ గొడ్డు మోతు పశువులున్నవారు తమ పశువులను గురించి బెంగెట్టుకోనవసరంలేదని కూడా వీరు వక్కాణించారట.

(36 వ పేజీ చూడండి)





ఈ చుక్కల వెంబడి కత్తిరించండి.

ఈ కూపన్ కత్తిరించండి. మీ పేరు, చిరునామా ఇంగ్లీషులో వ్రాసి కూపన్‌లో గల చిరునామాకు పంపండి. ఆపైన మీకు ప్రత్యేకమైన ఓ డిస్కౌంట్ వౌచర్ లభిస్తుంది. ఆ డిస్కౌంట్ వౌచరను మీ డీలర్ వద్దకు తీసుకువెళితే, అతను మీకు హాలో వీయిల్ ఆఫ్ లౌ టాల్క్‌ను మామూలు ఖరీదుకన్న రూ. 1.50 తక్కువకు ఇస్తాడు.

ఈ ప్రత్యేకమైన తగ్గింపు సౌకర్యం కొద్ది కాలానికే పరిమితం. అందుకే త్వరపడండి.
నేడే మీ కూపన్ పోస్ట్ చేయండి.

COUPON

To
Halo Veil of Love Talc D.O.
C/o Colgate-Palmolive (India) Pvt. Ltd.
12-A Ritchie Street, Madras 600 002.

APW

Dear Sirs,
I would like to have my Halo Veil of Love Talc discount voucher sent to :

Name ____________________

Address ____________________

____

HT.G.2 TL

వారఫలం

28-3-1975 శుక్రవారంమొదలు
3-4-1975 గురువారం వరకు

మేషం :— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యవహారాలు బాగుంటాయి. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అనవసరమైన వ్యయం చేస్తారు.

వృషభం :— మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. సాటివారితో మాట పట్టింపులు తగవు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ఇతరులతో కలసిచేసే వ్యాపారాలు లభిస్తాయి. వారం ఆఖరులో మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. స్త్రీలకు ఆరోగ్యం బాగుంటుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి.

మిథునం :— వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. ప్రయాణాలు బాగుంటాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమకలుగుతుంది. ఆడంబరంకోసం వ్యయం జరుగుతుంది. వారం ఆఖరులో రావలసిన డబ్బు అందుతుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

కర్కాటకం:— స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం ఆఖరులో మీ అంచనాలు తారుమారు కాగలవు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

సింహం :— వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. మిత్రులకు సహాయం చేస్తారు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్త్రీలకు—వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. దైవకార్యాలు నెరవేరతాయి.

కన్య :— భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధిస్తారు.

తుల :— వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. రావలసిన డబ్బు అందుతుంది. వారం ఆఖరులో సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. స్త్రీలకు —కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. విలాస వస్తువులు కొంటారు.

వృశ్చికం :— వ్యాపారంలో చికాకులు ఏర్పడతాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో మీకార్యక్రమాలు బాగుంటాయి. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. ప్రయాణాలు బాగుంటాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

ధనుస్సు :— మీ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. వారం మధ్యలో మీ తాలూకు వస్తువులు పోవచ్చును. అధిక వ్యయం జరుగుతుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమకలుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మకరం :— మీ కంటే పెద్దవారు కూడా మీ సహకారాన్ని కోరవలసివస్తుంది. పుణ్యకార్యాలు చేస్తారు. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు —ఆరోగ్యం బాగుంటుంది. వ్యతిరేకమైన వార్తలను వింటారు.

కుంభం :— వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రులకు సహాయం చేస్తారు. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. భవిష్యత్తులో లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధిస్తారు. స్త్రీలకు— అలంకార వస్తువులు కొంటారు. పుణ్యకార్యాలు చేస్తారు.

మీనం:— మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. ఆందోళన కలుగుతుంది. వారంమధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభించగలదు. నూతన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండ బంధుమిత్రులను కల్సుకొంటారు.

— మహేష్



ఇవాళ రిహార్సలు చాలాసార్లు చేశాం — కానీ మా నాటికలో స్త్రీ పాత్ర లేదు — నిజం! ఒట్టు !!

అతన్ని నేనూ చూస్తున్నాను, గమనిస్తూనే ఉన్నాను — రోజూ నాకేసి అదోలా, ఏదోపోగొట్టుకొన్న వాడిలాగా, ఏదో దొరకక ఇబ్బంది పడుతున్న వాడిలాగ చూస్తుంటాడు—నాకు తెలుసు, అతను నాలో ఏం వెతుకుతున్నాడో !

— పిచ్చివాడు — అతనికి తెలీదు. అతను నాలో వెతుకుతున్నదేదో అది ఎన్నాళ్లక్రితమో చచ్చిపోయింది, కాదు, బలవంతంగా చంపేసారు. ఒకరు, ఇద్దరూకాదు, మూకఉమ్మడిగా చేసిన హత్య అది.

పద్మవ్యూహంలో అభిమన్యుడి చావు గుర్తుకొస్తోంది నాకు !

నిజమే !—

బతికిఉన్న రోజుల్లో ఎంత హాయిగా అభిమన్యుడి తండ్రిలాగ బతికాను. అర్జునుడిలాగ సవ్యసాచిలా సంపాదించాను. రెండు చేతులా సంపాదించాను. సంపాదించిందెంతో తెలీనంతగ, లెక్కలేనంతగా !—

ఈ రోజుల్లో వెనక్కితిరిగి చూసుకొంటుంటే ఏంమిగిలింది ?— ధనమా ? ఆకాంక్షా ??—ఏదీలేదు.

సంపాదించింది సంపాదిస్తూంటే, రెండో చేతికి సైతం తెలీకుండా ఖర్చు చేశాను — ఖర్చంటే ఖర్చూకాదది, డబ్బనేది ఎవరికైనా ఉంటే ఎలా సద్వినియోగ పరచవచ్చునో వన్నుచూస్తే ఆ క్షణంలో తెలిసేది—

సరోజ అనేది — 'మీ కసలు లోకజ్ఞానం లేదండీ ! ఈరోజు ఇలా ఖర్చుచేసేస్తే, రేపనేరోజు మనకోటి ఉందనేది గుర్తుకొస్తే భయంవేయటంలేదుటండీ—'

సరోజ అమాయకురాలు.

ఈరోజు గడిస్తేగదా రేపు !


ఈరోజు సంతృప్తిగా గడుపుకోగలిగితే, రేపటిలో అసంతృప్తి ఎందుకు ఉంటుంది?— ఏదిఏమైనా మనిషి దృక్పథంలో ఉంటుంది.

అదే అనేవాణ్ణి నేను సరోజతో — "పుట్టినరోజు ఇంత సిరిసంపదలతో పుట్టామా సరోజా! పోయే సరికి ఇవన్నీకూడా వచ్చేనా?—"

"మీకింత వేదాంత జ్ఞానంకూడ ఉందని నాకిన్నాళ్లూ తెలీదు" అనేసి, కొంచెం నవ్వేసి, ఊరుకుండి పోయేది సరోజ.

నాకుతెలుసు—సరోజ అలా పైకి అంటుందేకానీ, నిజానికి అలా అనే మనస్తత్వం కాదు







నటించను!

తనది. కానీ ఆడతనం—ఏంచేస్తుంది?— అలా అప్పుడప్పుడు అంటుందే కానీ సరోజ నా అర్ధాంగి. నేనేంచేసినా ఆమోదిస్తుంది— ఆ మాటా ఒకసారి తనే అనేసింది—'ఆడదాన్ని. కట్టుకొన్న భార్యను. మీరూ సుఖపడక, నన్నూ సుఖపడనివ్వక, ఎందుకింతగా సంపాదించటం?—మీరే ఆలోచించండి. ఈ రోజు మీకూ నాకూ ఏంతక్కువ? అయినా ఇద్దరిలో ఏ ఒక్కరిలోనైనా సంతృప్తిగా బతుకుతున్నామనేది ఉందా? మీరే చెప్పండి—'

ఆ రోజున ఆలోచించాను. ఔను—సరోజ అంటున్నదాంట్లో అక్షరం అబద్ధం లేదు. ఇద్దరమూ ఒకగూటి పక్షులుగా బతుకుతున్నాము. అంతేగానీ ఇద్దరిలోనూ ఆ తృప్తి మిగిలి ఉందా అనేది సంశయాత్మకమే!—ఇంత సంపాదించి ఏంచేసుకోను?!

ఆలోచనలన్నీ ఒకతాటిమీదకు నడిపించి, చివరకు మనిషిగా నేను చేరుకోవాల్సిన గమ్యం ఆ తర్వాత చేరుకొన్నాను.

వెంటనే అందరితోనూ చెప్పేశా "ఇకమీదట ఆదివారంపని చేయను: సాయంత్రం అయిదు తర్వాత పనిచేయను. ఔట్‌డోర్‌లో అయితే పది రోజుల పనికి రెండు రోజులు సెలవు—'

అందరూ విన్నారు—అవసరం వాళ్లది. ఎవరికోసం వింటారు? నాబొమ్మ కనపడితే చాలు, ఆంధ్రదేశంలో అన్నిచోట్లా ఆసినిమా వంద రోజులు ఆడాల్సిందే!— ప్రేక్షకులంతా అభిమానధనంతో నన్ను ముంచేస్తున్నారు—వాళ్ల అభిమానంతోనే ఆడుతున్న సినిమాలన్నీ అన్నేసి రోజులు 'దిగ్విజయంగా ప్రదర్శించబడుతున్నాయి' అంతేగానీ—

ఇక్కడ ఆడేవి సినిమాలా?

వీటిలో ఓ కథా, కాకరకాయా?!

—ఓ సంగీతమా, ఓ సాహిత్యమా??—

వీటిలో ఏ ఒక్కటి ఉన్నా, అన్నీ కలిసి కట్టుగా ఉన్నా కానీ ఆడని సినిమా, నా బొమ్మతో వచ్చేసరికి, ఆంధ్ర ప్రజానీకానికి అదేం మాయ కమ్ముతుందో గానీ, ఆ సినిమా శతదినోత్సవాలూ, రజతోత్సవాలు...అంతే!—

అంతటి కథానాయకుడిని నేను. ఆ రోజున నిర్ణయించుకోవటం మంచికి జరిగిందో, చెడుకే జరిగిందో కానీ నేను నా ఇంటికి దగ్గరయినా—ఇంట్లో ఉంటే ఇంత హాయి, ఇంతటి ప్రశాంతత ఉంటాయని నా కిన్నేళ్లూ తెలీదు.

ఆర్క్‌లైట్లు, కెమేరాలకు దూరంగా —

ధర్మపథం

బులుసు వెంకటరమణయ్య

ముక్తుడు - మూర్ధాభిషిక్తుడు

వేషాన్నిబట్టి చూస్తేనే – అతను ప్రభువో, సామాన్యుడో తెలుస్తుంది. పూర్వకాలపు రాజులు పెద్ద పట్టుతలపాగా, పొడవైన – విలువైన అంగీ, నడుమను వ్రేలాడే నిశిత ఖడ్గమూ ధరించి ఠీవిని సూచించే మీసాలతో గంభీరంగా వుండేవారు. అట్టి వేషం గలవారు రాజు అని అనిపించుకునేవారు. కాని అంత మాత్రంచేత మూర్ధాభిషిక్తుడని అతనిని నిర్ణయిచరేం 'నేను రాజును' అని అతడు అనుకున్నా లాభం లేదు.

తాను రాజునని అనిపించుకోవాలంటే శత్రువులను సంహరించాలి. భూమండలం అంతటికీ ఆధిపత్యాన్ని సంపాదించాలి. అలా జరిగినప్పుడే అతడు రాజు అనిపించుకుంటాడు. నామమాత్రంచేత రాజునని అనుకోవడం సరికాదు. ఈ విషయాన్నే ఈ శ్లోకం చెప్తూ ఉంది.

'అక్రుత్వా శత్రుసంహారం
అగత్వాఖిలభూశ్రియమ్,
రాజాహమితి శబ్దాన్నో
రాజా భవితు మర్హతి'.

ఈ విధంగానే ముక్కు మూసుకుని, ఒక మూల కూచుని తాను ముక్తుడనని అనుకోవడం కూడా చాలా పొరపాటు. రాజు శత్రువులను జయించినట్లు ముక్తుడున్నూ అరిషడ్వర్గాన్ని జయించాలి. నిరతిశయానంద రూపమైన ఆత్మ సామ్రాజ్యాన్ని పొందాలి. అలా చెయ్యలేనప్పుడు వ్యక్తి తాను ముక్తుడనని భావించడం కేవలం భ్రాంతియే కాగలదు.

ప్రభువు సామ్రాజ్యాధిపత్యం వహించినట్లు ముక్తుడున్నూ మోక్ష సామ్రాజ్యాధిపత్యాన్ని వహిస్తాడనే ఉద్దేశంతోనే రాజునకూ, ముక్తునకూ సామ్యాన్ని ఆదిశంకరులు తమ వివేకచూడామణిలో తెలిపి ఉన్నారు.

ముక్తికి అరిషడ్వర్గాన్ని జయించడం మిక్కిలి ఆవశ్యకం.

కట్, ఆన్, ఆఫ్‌లకు అతీతంగా –

ఇంట్లో ఇంత హాయిగా ఆప్యాయతతో జీవితం పంచుకొనే సరోజతో గడిపితే ఎంత బాగుంటోంది ?

ఇన్నేళ్ళూ నాకెందుకు కలగలేదు ఈ జ్ఞానోదయం ?–

కొన్నాళ్ళు బాగానే గడిచాయి – కానీ ఆ తర్వాతే అర్థమయిపోసాగింది నాకూ, సరోజకూ –

కష్టపడి చేసేపని తర్వాత విశ్రాంతి కోరుకోవటం తప్ప అన్నసంగతి తెలిసి వచ్చేసరికి పరిస్థితి చేయిదాటిపోసాగింది.

పరిశ్రమ నా చేతిలోంచి జారిపోయింది.

ఇంతకాలమూ నా వెంట తిరిగిన చిత్ర పరిశ్రమ, చిత్రంగా మారిపోయింది – ఇప్పుడు నేను దానివెంట తిరిగినా అది నాకేసి తిరగటం మానేసింది.

ఆ ఆర్క్ లైట్లకూ, కెమెరాలకూ, సెట్‌కూ, షూట్‌కూ దూరంగా బతకలేక పోయాను చాలా రోజులు ఆ స్టుడియోలలో అటూ ఇటూ తిరిగి వచ్చేసేవాడిని. నా రాక కూడ వాళ్ళకు ఇబ్బంది అవుతోందన్న సంగతి గమనించి అదీ మానేసాను.

తెరమీద ఎన్నిరకాల వేషాలు వేసినా అవన్నీ జీవితంలో వెయ్యకూడనివీ వెయ్యలేనివీ అయిపోయాయి.

తెరమీద ఎన్నిరకాల పనులు క్షణాలమీద చేసేయగలిగినా, వాటిల్లో ఏ ఒకటీ నిజ జీవితంలో చేయలేకపోవటం నా దౌర్భాగ్యం –

తెరమీద ఏ పని ఎలా చేయాలో నిర్దేశించే వాళ్ళు అంతమంది ఉండేవారు. ఈ క్షణాల్లో ఏ ఒక్కరూ ఈ పని చెయ్యమని చెప్పరేం ?

ఈ చేతులమీదుగా లక్షల రూపాయలు నాట్యం చేశాయి – అవన్నీ ఏమైపోయాయి? ఏవేళి సందుల్లోంచి వెళ్లిపోయాయి ??

ఈ రోజు ఇలా గడుస్తోందేం ? ఇంత భారంగా ఇంత ఘోరంగా ఇంత నెమ్మదిగా ఎప్పుడైనా గడిచిందా రోజు ? ఇంతక్రితం ఎప్పుడూ ఈ స్టూడియోనుంచి ఆ స్టూడియో చేరుకొనేసరికే ఆలస్యం అయిపోయేది. తన కన్నా ముందే పరిగెట్టి వెళ్ళిపోయేది కాలం– అదంతా మళ్ళీ వెనక్కు రాదేం ? ... ఒక్కసారి... ఒక్కసారి ఒక్కసారి తిరిగి వస్తే...

కూరలు కొనుక్కొని, కాలినడకన ఇంటికి రావాల్సి వస్తుందని ఏ ఒక్క క్షణంలోనైనా అనుకున్నానా ? ఈ రోజున ఇలా గీత అడ్డం తిరిగిపోయింది గనుక ఇలా ఇంతటి గతాన్ని భుజానవేసుకొని, పూలమ్ముకొన్నచోట కట్టెలమ్ముకోలేక ఇలా ఇంకోవూరు వచ్చేసి ...

ఇల్లు చేరుకొన్నాను. నా చేతిలోని సంచీ సరోజ అందుకొంది మౌనంగా – సంచిలోకి చూసింది. సంచిలోంచి కూరగాయలు సరోజను నవ్వుతూ పలుకరించాయి.

ఇంతలో వాకిలిదగ్గర ఎవరిదో అలికిడి అయితే అటు తిరిగాను – ఔను ! అతనే ! నన్ను వెతుక్కుంటూ నావెంట వచ్చేశాడన్న మాట.

అప్రయత్నంగా లేచి నిలబడ్డాను.

ఆ అబ్బాయి నమస్కారంచేసి లోపలకు వచ్చాడు. ప్రతినమస్కారం చేశాను.

"ఏమండీ..."

తెలుసు, అతను ఏం అడగబోతున్నాడో ! నా ముఖం మలినమయిపోయింది. అలవాటు చొప్పున ముఖాన నవ్వు పులుముకొన్నాను.

"ఏమండీ-మీరు ఒప్పుకొంటే ... నాకు తెలుసు మీరు కరుణాకర్ గారని! మీరు ఒప్పుకుంటే మీకు సన్మానం చేద్దామని అనుకొంటున్నాం..."

"కరుణాకర్...?"

"అదేనండి మీరు ఆంధ్ర చిత్ర సీమలో..." ఆగిపోయాడు అతను. కాదు. కాదు, నేను ఆపేసాను. ఆపేసి అన్నాను – "క్షమించండి, మీరు అనుకొంటున్న కరుణాకర్‌ను కాను నేను. ఆయనకూ నాకూ పోలికలున్నాయేమో ! – అయినా మీకు తెలీదేమో, ఆయన చనిపోయి చాలకాలం అయింది."

అతను క్షణంసేపు అవాక్కయిపోయాడు. ఆ తర్వాత ఇంకేం అనాలో అర్థంకాక, అతను బయటకు నడిచాడు.

క్షణంతర్వాత ... నాకు నేనే పెట్టుకొన్న చితిమంట ఆరకుండానే ... నా ఎదురుగా సరోజ. సరోజ కళ్లల్లో నీళ్ళు. ఆపుకొంటున్న వెక్కిళ్ళు–

నెమ్మదిగా అన్నాను – "నన్ను క్షమించు సరోజా ! జీవితంలో ఆఖరిసారి నటించాను. ఇంకెప్పుడూ నటించను !"

భోరుమన్న సరోజతో మౌనంగా నేనూ ...

సీరియల్

రంగులవల

పాలడుగు వెంకటేశ్వరరావు

(గత సంచిక తరువాయి)

అంతా జాగర్తగా చూసి 'ఏం డిఫెక్టు లేదే? ఎందుకున్నట్టు గుండెల్లో నొప్పి?' అని ప్రకాశం చేసాడు స్వగతాన్ని డాక్టరు.

భూషయ్య నవ్వునాపుకున్నాడు. 'ఓరి బుడ్డ డాక్టరు! అక్కడ్నే వుందయ్యా కిటుకు? నువ్వు సరిగానె కనిపెట్టావు? నా పరీక్షకి కట్టుకున్నావు. లేకపోతే రాయిలాంటి మనిషిని, నాకు గుండెల్లో నెప్పేమిటి?' అందామనుకుని రాజారావు మాటలు జ్ఞాపకం వచ్చి నాలుక కరుచుకున్నాడు భూషయ్య.

కరుచుకుని డాక్టరువెంట ముందుగదిలోకి వచ్చాడు.

'ఎన్ని పరీక్షలు చేసినా ఏం డిఫెక్టు కనపట్టంలేదండి. ఎందుకయినా మంచిది. రెస్టు తీసుకోమనండి. ఉప్పు కారాలు తగ్గించాలి. టానిక్ రాసిస్తాను. వాడమనండి.' అన్నాడు డాక్టర్ కూర్చుని ప్రిస్క్రిప్షన్ రాస్తూ.

రాజారావు చిర్నవ్వు నవ్వాడు.

అన్నంలో కలిపిన ఆవకాయయొక్క రక్తవర్ణం గుర్తువచ్చి భూషయ్య గుండె ఝల్లుమంది. భూషయ్య రోజూ అన్నంలో ముఖ్యంగా దంచేదే అది!

ఇంతలో కుర్రాడు కాఫీలు తెచ్చేడు.

'శ్రమ ఇస్తున్నాం డాక్టర్?' అన్నాడు రాజారావు నవ్వి.

డాక్టర్ నవ్వాడు. 'ఫర్వాలేదు. తీసుకోండి.'

'అసలే మా బావగారు హార్టు పేషంటు.'

'మరేం భయంలేదు. నేనున్నానుగా.'

'హార్టు పేషంటూ నీ పిండాకూడా' అందామనుకుని ఆగిపోయేడు భూషయ్య. కాఫీ తాగేక ప్రిస్క్రిప్షన్ చీటీ తీసుకుని వస్తామని లేచారు. డాక్టరు కూడా లేచి 'నమస్కారం. ఉంటానండి.' అన్నాడు భూషయ్యనుద్దేశించి.

'ఈ నమస్కారం నా లక్షలకేలే బుడ్డాడా. తెలివిగల చిన్నాడివి. నా పరీక్షలో ప్యాసు అయ్యావులే.' అనుకున్నాడు భూషయ్య.

కూరగాయల మార్కెట్‌దగ్గర కారాపించి బుట్టల్తో పళ్ళు పట్టుకొచ్చేడు రాజారావు.

'అబ్బ! ఎందుకయ్యా డబ్బు దండగ.' అని విసుక్కున్నాడు భూషయ్య.

'వెధవ డబ్బు ఎందుకు? సంతోషంగా వున్నప్పుడైనా తినిచావక? ఏడ్చే సమయాల్లో ఎట్లా అయినా తినబుద్ధిగాదు.' అని వేదాంతం చెప్పాడు రాజారావు.

'ఇంతకీ ఏమంటావు?'

'దేనిగురించి?'

'అమ్మ బావా! నీ బుర్ర పెద్దబుర్ర.'

'నీది కానట్టు, పెద్ద.'

'ఇంతకీ కుర్రాడు నచ్చాడా?'

'చెప్పానుగా. నీ బుర్రే పెద్ద బుర్రని.'

'అబ్బ. బావా ఏం చతురతయ్యా? నీ బుర్రని బూర్లెగంపలో పడెయ్య.'

'సర్లె. సర్లె' అంటు సకిలించాడు భూషయ్య బూర్లెని తల్చుకుని. తర్వాత తనే అన్నాడు.



"బుద్దాడు వాకు నచ్చాడు. ఇంతకీ అమ్మాయికి నచ్చాడా ?"

"అది ముందే అయింది. లేకపోతే నిన్నెందుకు రమ్మనేవాడ్ని ?"

"అదీ నిజమే. అయితే మనం ఎప్పుడు మాట్లాడదాం ?"

"అదిగో. ఆ తొందరే వద్దు. ఆడపిల్లవాళ్లం గనుక మనకి తొందరుంటుంది. ఆ తొందర వాళ్లకెందుకుంటుంది. నీకెందుకు నువ్వు నిశ్చింతగా వుండు. నేను చూసుకుంటాగా ? విషయాన్ని జాగర్తగా దారికి తేవాలి మరి! తొందర పనికి రాదు."

"అవుననుకో. ఇక ఏమిటి చేసేట్బూ అని ?"

"అలా అడుగు చెపుతాను. కుర్రాడ్ని చూసాముగద. ఇక పెద్దర్ని మూద్దాం."

"అదీ పద్ధతి."

కారు యింటిదగ్గర ఆగింది.

ఉషారుగా యిద్దరూ లోపల్కి వెళ్లేరు.

కాంతమ్మా నీలమ్మా తాలింపులు పెడుతున్నారు.

భూషయ్యకి నోరూరి ఆనందంగా సకిలించాడు.

11

ఆ సాయంత్రం అందర్నీ సినిమాకి బయలుదేరతీసాడు రాజారావు. భూషయ్య నేను రాను మొర్రో అని మొత్తుకున్నాడు. నలుగురూకల్సి బలవంతాన లాక్కుపోయేరు.

సుందర్‌లో 'అయినింటి అమ్మాయి' సినిమా చూసారు. ఆ సినిమాలో హీరోయిన్ ఆస్తిపాస్తులు తెచ్చి, నచ్చినవాడ్ని చేసుకుంటుంది. తర్వాత ఒక్కొకరుగా హీరో తల్లిదండ్రులని, అన్నదమ్మర్ని, అప్పచెల్లెళ్లని ఇంట్లోంచి తరిమేస్తుంది. చివర్కి భర్తకి కూడా దూరమయి తలిదండ్రుల పంచను చేరుతుంది. తెలుగు సినిమా గనుక చివర్లో పశ్చాత్తాపపడి మరల భర్తని చేరుకొని అందర్నీ క్షమాపణలు వేడి ఆ కుటుంబాన్ని తిరిగి కలుపుతుంది.

హీరోయిన్, హీరోల్ని చూస్తున్నంతసేపూ భూషయ్యకి మంజాలా, డాక్టర్ సుందర్రావూ కళ్లలో మెదిలేరు. అయితే ఆ సినిమా అతనికి నచ్చలేదు.

"ఏం సినిమాలివి ? అందుకే నేను రానన్నాను." అని నిష్ఠూరించాడు.

"ఏం ?" అన్నాడు రాజారావు.

"అవునయ్యా. అయినయింటి ఆడపిల్లని తీసుకెళ్లి ఆ దరిద్రుల యింట్లో పడేస్తిరి. అందరూ కలిసి తగుదునమ్మా అని ఆ పిల్లని నానా బాధలూ పెడితిరి. పైగా చివరికి ఆ పిల్లచేతనే తప్పయిందనిపిస్తిరి. ఇదేం న్యాయం ?"

"వున్నవాళ్లూ, లేనివాళ్లూ అలా కలిసిపోయి సోషలిజం తేవాలని సందేశం." అన్నాడు రాజారావు నవ్వి.

"సోషలిజం. నా పిండాకూడు. చేతకాని ప్రతివాడూ సోషలిజం అని ఒకటే పాట. విని విని శోషకొస్తుంది."

"ఇప్పుడట్లానే అప్పిస్తుందిలే. నిజమయిన సోష వచ్చినప్పుడూ, ముందున్న మొనళ్ల పండగ ఎదురయినప్పుడూ చెప్తావుగాని ఈ కబుర్లు."

"అంటే ? !" భూషయ్య అనుమానంగా చూసాడు.

"అదే బావా ! ఇప్పుడు గాకపోతే మరో పదేళ్లకయినా 'అది' రాదా ? నువ్వూ నేనూ చూడక పోతామా ? అని" అని నవ్వాడు రాజారావు.

"సర్లె. సర్లె" అని సకిలించి చుట్ట ముట్టించాడు భూషయ్య, జరిగేదా చచ్చేదా అనుకుంటూ. ఇంటికొచ్చి భోంచేసి చాలసేపు కబుర్లు చెప్పుకుంటూ వుండిపోయారు బావామర్దులు.

"అయితే యింకా మనం ఎవరెవర్ని కలుసుకోవాలి." అని అడిగాడు భూషయ్య.

"ఈ వూళ్లోనే అతని అన్న వున్నాడు. ఇద్దరూ ఎప్పుడో విడిపోయేరనుకో. రేపు అతన్ని కల్సుకుందాము. తర్వాత ముఖ్యంగా మనం హైదరాబాదు వెళ్లాల్సి వుంటుంది. ఉత్తరంలో రాసానుగా. అక్కడ వాళ్ల మేనమామని కల్సుకొని అన్నీ వివరంగా మాట్లాడుకొని సెటిల్ చేసుకుందాము. ఆ తర్వాత నీ యిష్టం."

"అది సరేననుకో. ఇవన్నీ ఎప్పుడు తెమిలేటట్టు ?"

రాజారావు నవ్వాడు.

"అంత తొందరయితే ఎలా బావా ! అన్నీ ఒకటొకటి నరుక్కురమ్మన్నారు. రేపు యిక్కడ పని ముగించుకొని, ఎల్లుండో ఆ తర్వాతిరోజో హైదరాబాద్ వెడదాము."

"అవతల ప్రత్తి చేను వుందయ్యా. అంతా అట్లాపెట్టి ఎన్నాళ్లని కూర్చునేది ?"

"అన్నట్టు ప్రత్తి చేనుని ఏంచేసి వచ్చావు బావా ! అడగటం మరిచాను."

"మా చలమయ్యని చూడమన్నాననుకో. అయినా మరొకడ్ని ఎన్నాళ్లని నమ్ముకొనేట్టు ? ఎంతయినా పరాయివాడు పరాయివాడేగదా !"

"సరే అయితే. రేపుదయం యిక్కడ పని చూసుకొని రాత్రే బయలుదేరి పోదామా ?"

జరిగిన కథ 3 : మంజుల. పెండ్లాడే ప్రయత్నంలో వచ్చిన బోసుబాబును భూషయ్య బావ అవమానించి పంపగా అక్క కాంతమ్మను సంప్రదించటానికి తానే వస్తాడు రాజారావు. మంజులకి నచ్చిన డాక్టర్ సుందర్రావు భూషయ్యకీ నచ్చుతాడు.

"రాత్రా ? !"

"అవును. టాక్సీలో బయలుదేరితే ఐదు గంటలప్రయాణం. తెల్లారేసరికి అక్కడుంటాము."

"టాక్సీయా ! ?"

"అవును. ఏం ?"

"కొంపలు ముంచుతున్నావుగదయ్యా. ఇలా ఎక్కళ్లేని డబ్బూ తగలేస్తే ఆరిపోమూ ?"

"ఏమయినాసరే, తప్పదు. అవతల వియ్యాలవారి ఎదట ప్రిస్టేజీ నిలుపుకుంటామా ? లేక లేకి నాగమ్మల్లా వెళ్లి చొంగలు కారుస్తూ నిలబడితే మన సంబంధానికి వాళ్లు వొప్పుకుంటారనుకుంటున్నావా ? వీళ్లు 'ఏం లేనివాళ్లు' అని వాళ్లు అనుకుంటే ఇంక గోవిందేగాదా ?"

"అబ్బ. నువ్వు ఎప్పుడు యింతే. మెడకి వదిలితే కాలికి. కాలికి వదిలితే మెడకి బంధం వేస్తావు."

"నీ యిష్టంమరి. నువ్వు కాదూ అంటే ఈ క్షణాన కారుని అవతలకి పంపించేస్తాను. తర్వాత నన్ననగూడదు మరి" అన్నాడు కోపంగా రాజారావు.


"అబ్బ. సర్లేమంటున్నాగా" అని దిగజారాడు భూషయ్య.

అప్పటికి అందరూ నిద్రల్లో పడ్డారు.

గడియారం పన్నెండు చూపించింది.

రాజారావు ప్రక్కకితిరిగి పడుకొని వెంటనే గుర్రుకొట్టి నిద్రపోయాడు.

భూషయ్యకి ఎంతకీ నిద్రపట్టలా. ఏవేవో ఆలోచనలు తలంతా ముసిరేయి. మనసు తొందర



పడ్తూ వుంది. ఇదేదో తొందరగా ముగించాలి. మరల వస్తాయిస్తే ఎవడో తన్నుకుపోగలడు. అందుకే వదలిపెట్టకుండా రాజారావును రాపాడాలి. అవతల ప్రత్తి చేను వుంది. చలమయ్యకి అప్పచెప్పి వచ్చాడనుకో. చలమయ్యకి కాస్త బద్ధకం ఎక్కువ. ఏమాత్రం అజాగ్రత్త చూపించినా ప్రత్తి దెబ్బ తింటుంది. మరల కోలుకోవటం కష్టం. కనుక వీలయినంత త్వరగా తిరిగి రాముడుపాలెం వెళ్లిపోవాలని మనసు తొందరపెడ్తుంది. అయితే యివతల చూడవలసిన విషయమూ తేలికయినది కాదు. మంజుల తన గారాల పుత్రిక. ఒక్కగానొక్క సంతానం.

మంజుల అమాయకురాలు. అంతా తల్లి పోలిక.

తల్లికి — ఎవరికిమాత్రం వుండదు—పుట్టింటి వైపు ఆపేక్ష వుంటుంది. కాని మంజుతల్లికి వుండాల్సిన అవసరం ఏమిటి ? కౌమారదశ దాటి యవ్వనంలో అడుగుపెట్టున్న తొలి రోజులలో మంజుల తప్పటడుగు వేయబోయింది. అంతా తనకే తెల్సు. తను ఆవులిస్తే పేగులు లెక్కపెట్ట గలడు. కళ్లలోకి చూసి మనసులో ఏముందో చదవ గలడు. కనుకనే అపాయాన్ని ఉపాయంతో తప్పించేడు. అప్పుడేం జరిగింది ? అక్కడికీ తను వద్దన్నా వినకుండా అప్పుడు మంజులని తీసుకుని కాంతమ్మ అన్న యింటికి వెళ్లింది. అసలే అమాయకురాలు తను. రాజారావు దేవాంతకుడు. మాయలమారి. ఇంకేం ? కాంతమ్మని బుట్టలో వేసి గిత్తల్ని కలిపారు. మొగుడూపెళ్లా లన్నారు. సినిమాల కెళ్లమనీ, షికార్లు కొట్టమనీ ప్రోత్సహించారు.

అయితే అపాయాన్ని వూహించిన తను, వెంటబడి వుత్తరాలమీద వుత్తరాలు చలమయ్యతో రాయించి తల్లీ కూతుళ్లని తిరిగి రప్పించేడు.

తిరిగి వచ్చాక, మంజుల కళ్లలో మెరుపూ, నడతలో వున్న వుషారూ గమనించి కంగారుపడ్డాడు. ఆ నాలుగోనాడే మంజుల వుత్తరం అందుకొని రహస్యంగా చదువుకొని జాకెట్టులో దాచుకోవటం తన కళ్లపడింది.

ఇంక సందేహంలేదు. తప్పటడుగు వేసి కూతురు కొంపముంచబోతోంది — అనుకున్నాడు.

కూతుర్ని దగ్గర కూర్చోపెట్టుకొని నూరి పోశాడు. మనసు విరిచి తన కోరిక ప్రకారం మలి పాడు. లౌకిక జీవన రహస్యాన్ని రంగరించి బలవంతాన తాగించాడు, మంజులకి.

'వాళ్లు' లేనివాళ్లు. తనకి ఎంతో వుంది. ఈ రెండూ రెండు వర్గాలు. రెండూ కలియవు. ఒకవేళ కలిసినా చికాకులు ఘర్షణలు తప్పవు. మన శ్శాంతి పోతుంది. కలలుకరిగి కన్నీరు మిగులుతుంది. లేనిపోని కంపర. సితలాటకం. పుణ్యానికిపోతే పాపం ఎదురయినట్టుగా. అసలు అంత ఖర్మే పట్టింది ? వియ్యానికైనా కయ్యానికైనా సమానత వుండాలి. తమ అంతస్తుకి రాజాలాంటి సంబంధాలు వస్తాయి. కార్లలో తిరగొచ్చు. బంగ్లాల్లో బంగారు తెరల మంచాల్లో కులకచ్చు. అంతా డబ్బుతో వుంది. డబ్బు లేకపోతే ఈ ప్రపంచకంలో ఏమీ

లేదు. రూకలేనివాడు కాసుకు కొరగాడు. అసలు ఆ డబ్బుకోసమే వాళ్లు ప్లాను వేసారు. 'చిన్న పిల్ల'ని చేసి బుట్టలో వేసారు. అంతా కుట్ర. మోసం. ఆ బోసుబాబుకేం వుందసలు ? మహా అయితే తనుకూడా 'బాబు'లాగా కాలేజి మాష్టరు అవవచ్చును. తన సర్దాలు ఏవీ తీరవు. అడిగితే విదలించికొడ్తారు. తిడుతారు. మొత్తం కుటుంబం వచ్చి మీదపడ్తుంది. స్వేచ్ఛలేదు. సుఖంలేదు. శాంతిలేదు. అనురాగం వుండదు. మిగిలేదల్లా ఘర్షణలు, పిచ్చిపనుల్లా. ఇట్లాగేచేసి మొదట ప్రేమలంటూపోయి చివరికి ఆత్మహత్యలు చేసుకున్న వాళ్లున్నారు."

"అమ్మో !" అంటు గుండెలమీద చేతులు వేసుకుంది మంజుల.

"నీ యిష్టం. కావాలని కష్టాలు కొని తెచ్చుకుంటావో లేక నామాట విని సుఖపడతావో ? మాకుమాత్రం నీ సుఖంకంటె ఇంకేం కావాలి ? యిదంతా ఎందుకు ? ఈ సంపాదన, ఆస్తి

పాస్తులు అన్నీ నీవిగావూ ? నువ్వు చల్లగా వుండటమేగదా మాకు కావలసింది ?"

నాన్నా అంటు బావురుమంది మంజుల.

"ఇందులో నీ తప్పేం లేదు తల్లీ. నువ్వు నా బంగారు తల్లివి. కాకపోతే వాళ్ళు కుట్ర చేసి నిన్ను ఇరికించారు. ఇప్పటికయినా మించిపోయింది లేదు. వూర్కో. నే నున్నానుగా. ఇక ఆ బోసుగాడ్ని మర్చిపో. అది చాలు. మిగతా సంగతి నేను చూసు కొంటాను. నీ ముందు బంగారు భవిష్యత్తు వుంది. నువ్వు ఎన్ని సుఖాలు అనుభవించాలో, ఎంతటి వైభవాలు జరుపుకోవాలో — అవన్నీ చూడాలనే తల్లీ నా తాపత్రయం. ఏమంటావు ?"

"నాన్నా. నువ్వు చెప్పినట్టే చేస్తాను" అంది మంజుల.

"నా బంగారు తల్లి మంచిది." అని పకిలించి, చుట్ట వెలిగించాడు భూషయ్య. వెలిగించి వలభై ఎకరాల మాగాణీ; ముప్ఫయి ఎకరాల మెట్ట. అంతా వూర్కె బంగారంవంటి పిల్లతోసహా దొబ్బుదామని— అని పళ్ళు నూరాడు.

భూషయ్య ప్రక్కకి తిరిగి నవ్వుకున్నాడు.

మొత్తానికి తను అనుకున్నది సాధించపోతు న్నాడు.

అందుకు ఆ రాజారావునే వుపయోగించు కొంటంలో వుంది అసలు గొప్పతనం !

తృప్తిగా నిట్టూర్చాడు భూషయ్య.

"హాయ్ ! అంతా దైవలీల" అంటు ఆవలించాడు.

కాసేపట్లోనె గుర్రుకొట్టి నిద్రపోయాడు.

12

ఉదయమే మొహం కడుక్కొని, నీలమ్మ ప్లేట్లో పెట్టి పంపించగా, డజనుదాకా వూరీల్ని లాగించాడు భూషయ్య. పాలు తాగి చుట్ట వెలిగించేడు. పకిలించి బండిని ప్రయాణాన్కి సిద్ధం చేసేసర్కి బట్టలు వేసుకుని తయారయి రాజారావు వచ్చేడు.

"లడీయా ?"

"ఆఁ రెడీయే." అని నవ్వాడు రాజారావు.

ఇద్దరూ బయలుదేరి ముందు వరండాలోకి వచ్చారు. మంజుల వరండాలో కుర్చీలో కూర్చుని జమున ముఖచిత్రం గల సచిత్ర వార పత్రికని దీక్షగా చదువుతున్నది.

"బావా ! అంతా జ్ఞాపకముందిగదా ! ఇక్కడ కూడా చిన్నటికిమల్లెనే నువ్వు నోరు విప్పకూడదు. ఇతనుకూడా చదువుకున్నవాడు. పైగా ముక్కోపి. కనుక ఇంకా జాగ్రత్తగా వుండాలి." అని చెప్పి ఏదో జ్ఞాపకం వచ్చి ముందు గదిలోకి వెళ్ళాడు. ఫోనులో కాసేపు మాట్లాడి వచ్చాడు.

ఇద్దరూ బయలుదేరపోతూ వుండగా పిల్లి ఎదురు వచ్చింది.

"వచ్చాంరా బాబు. శకునం మంచిది గాదు. కూర్చో కాసేపు" అంటు కూలబడ్డాడు రాజారావు. భూషయ్యకూడా తిట్టుకొంటూ తిమ్మకుంటూ కూర్చున్నాడు.

"ఏం ? మంజుతల్లీ?" అంటు పల్కరించాడు రాజారావు.

"ఏంటి మావయ్యా. నేనుకూడా రావాలా?"

"మేం ఎక్కడికి వెళ్తున్నామనుకుంటు న్నావు ?" అంటు నవ్వాడు రాజారావు.

"డాక్టర్ దగ్గరికేగదా !" అమాయికంగా అంది మంజుల.

"అంత తొందర పనికిరాదమ్మాయి. నిదానం ప్రధానం అన్నారు. అయితే మేం ఇప్పుడు వెళ్తున్నది అతని దగ్గరకి కాదు."

మంజుల సిగ్గు పడింది. మొహం ఎర్రగా చేసుకుని లోపలికి తుర్రుమంది.

"చూశావుగా బావా ?"

"ఏమిటి నాయనా ?"

"అదే. అమ్మాయి తొందర. ఇక లాభం లేదు. త్వరగా ఆ మూడు ముళ్ళూ వేయించాల్సిందే."

"అదేదో త్వరగా కానిచ్చి పుణ్యం కట్టుకుంటా నవేగా."

"అదిగో. అదిగో. నువ్వూ తొందరపడు తున్నావు !"

"సర్లె. సర్లె. నీకూ ఒక ఆడపిల్ల వుంటె తెల్సివచ్చేది."

"అవున్లె. ఇక బయలుదేరదామా ?"

ఇద్దరూ లేచారు. వాళ్ళని ఎక్కించుకొని కారు మామిళ్ళగూడెం వయిపు దూసుకుపోయింది. బస్సు డిపో దాటి ఒక డాబా ఇంటిముందు ఆగింది. 'పం. పాం' అంటు హారన్ మ్రోగింది. కారు దిగి రాజారావు వెనకే నడిచాడు భూషయ్య.

[ఇంకా ఉంది]



SISTA'S-GN-410 TL

★ సినిమా విశేషాలు ★



"అయినవాళ్లు"లో రత్నాంజలి

లక్ష్మి మెచ్చిన గంగ!

నటిగా లక్ష్మికి ఆమే సాటి అంటారు, విషయం తెలిసినవాళ్లు. ఆమెను ఆంధ్ర ప్రేక్షకులు "రిచ్" రోల్స్‌లో చూడడానికి అలవాటుపడ్డారు. అట్టి పాత్రలకు ఆమెతప్ప మరొకరు పనికిరారు అన్న భావం ప్రేక్షకులకు వున్నది.

రాధికా మూవీస్ నిర్మిస్తున్న "మావూరి గంగ" చిత్రంలో లక్ష్మి వినూత్నమైన పాత్రను పోషిస్తున్నది. అనవసరంగా అపనిందలను భరిస్తూ, ఆపదలను ఈదుకుంటూ, పరులకోసం తన జీవితాన్ని త్యాగంచేసిన "గంగ" పాత్ర అంటే లక్ష్మికి ఎంతో యిష్టం. అందుకనే, "గంగ" పాత్రలో లక్ష్మి నటించడంలేదు...జీవిస్తున్నది. డి. వి. నరస రాజు రచన సారస్యంగా వున్నది. ఈ చిత్రంలో జగ్గయ్య, సత్యనారాయణ, ధూళిపాళ, వెంకటేశ్వర రావు, శుభ, పి. ఆర్. వరలక్ష్మి ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. సుఖదేవ్ ఛాయాగ్రాహకుడు.

ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న రామచంద్రరావే సంగీతాన్ని సమకూర్చారు. ఏడు పాటలు వినిపించారు. ఇటీవల యింత మంచి సంగీతం విన లేదేమో అనిపించింది. ఈ చిత్రానికి కె. ఎస్. ఆర్. దాస్ దర్శకుడు. ఒక పట్టు పడుతున్నాడు. పూర్ణా రిలీజ్.

చలానికి మలుపు

పెరుక్కుంటూ వచ్చిన వరలక్ష్మిని వలదన్న ఫలితంగా కొన్ని చిత్రాలు మరో హీరోకు వెళ్లాయి.

"బుల్లెమ్మ — బుల్లోడు" విడుదలానంతరం చలం చుట్టూ ఎందరు వచ్చారో నాకు తెలుసు. అన్నీ వద్దని చెప్పేశారు.

ప్రజలలో చలం అంటె అదోరకం ప్రేమ, అభిమానం వున్న నిజాన్ని ఎవరూ కాదనలేరు.

ఈమధ్య విడుదలయిన చలం నటించిన కొన్ని చిత్రాలు ఆర్థికంగా నష్టపోయినమాట వాస్తవమే అయినా, అతడి నటనలో మచ్చ కనిపెట్టడం కష్ట సాధ్యమే.

చలం నట జీవితంలో మరో మలుపును తెచ్చే చిత్రం త్వరలో దర్శనమివ్వబోతున్నది. చిత్రం పేరు "తోటరాముడు." ఆ చిత్రంలో చలం ప్రజలు పదే పదే ప్రశంసించే పాత్రను పోషించారు. వీర, శూర, శృంగార రసాలన్నీ వున్న పాత్రను చలం ప్రజ్ఞతో పోషించారు. ఈ చిత్రానికి బి. వి. ప్రసాద్ దర్శకుడు. కుమారి మంజుల (కన్నడం) కథానాయికగా నటించింది. చాలా యాక్టివ్‌గా నటించినట్టు వార్త.

శారదకు గుడ్ స్టార్ట్

ఈ ఏడు శారదకు మంచి రిజల్ట్‌తో ప్రారంభ మైంది. సంవత్సరారంభంలో విడుదలైన "దేవుడు చేసిన పెళ్లి" యిప్పటికీ ప్రేక్షకులిష్టపడే చిత్రంగా ప్రదర్శనయోగ్యమైనదంటే, శారద ఆ పూర్వ నటన ముఖ్య కారణమనిచెప్పొచ్చు. ప్రారంభ నెలచివరి రోజున విడుదలైన "జమిందారుగారి అమ్మాయి" నలుపు—తెలుపు చిత్రాలలో దీటుగా నిలబడింది.

రాబోయే శారద చిత్రాలలో "బలిపీఠం" బంపర్‌గా ఆడగల అర్హతను బడసియున్నది. అందులో అరుణగా సరికొత్త శారద సాక్షాత్కరిస్తుంది. "వైకుంఠపాళి" కూడా ప్రేక్షకులను సంతృప్తిపరచగల అంశాలను గొనియున్నది.

ప్రజలలో శారదకు ప్రత్యేకమైన మర్యాద వున్నది. ఆమెను గృహిణిగా, ఆడపడుచుగా, సాధు శీలగా పరిగణిస్తారు. అలాంటి వేషాలలో ఆమెను చూడడానికి యిష్టపడతారు. ఆమె నటనలో నాచురాలిటీ కొట్టొచ్చినట్టు కనిపిస్తుందన్న వారి అభిప్రాయం న్యాయబద్ధమే.

రంగనాధ్, శారదల వాగ్వివాదం

శారద, రంగనాథ్ యింట్లో పనిమనిషిగా చేరింది. సమస్యల వలలో చిక్కుకున్న ఊర్వశి అభిమానాన్ని చంపుకొని, పనిమనిషిగా మారిందంటే, ఏదో జరిగుంటుంది. రంగనాథ్ శారదను ఓకంట కనిపెడుతునేవున్నాడు శారద నాటకం, నాచికం చూస్తే ఆవిడ పనిమనిషి కాదు, చదువుకున్నదని అట్టే పసిగట్టేశాడు రంగనాథ్. అందుకే ఓనాడు అనుకోకుండా ఇలా ప్రశ్నించాడు శారదను.

రంగ: ఎవరు నువ్వు?

శారద: పనిమనిషిని.

రంగ: పనిమనిషివా? పట్టమహిషివా? నువ్వు పనిమనిషివి కాదు. బాగా చదువుకున్నదానివి.

శారద: చదువు పనికి అడ్డురాదు.

రంగ: మా యింట్లో ఎందుకు చేరావ్?

శారద: పొట్టకూటికి.

రంగ: రిట్జ్ హోటల్లో కుర్రాడికి యిరవై రూపాయలు పెట్టి టిఫిన్ పెట్టించావ్. పొట్ట కూటికి చేరావా మా యింట్లో. ఎందుకాడుతున్నావీ నాటకం?

శారద: నన్ను వెళ్లనివ్వండి.

రంగ: నిజం చెబితేగానీ వెళ్లనివ్వను.

శారద: నిజం చెబితే ఒక్కొక్కప్పుడు ప్రాణానికే మోసం.

రంగనాథ్, శారదలమధ్య ఈ వాదం ఎందుకు వచ్చింది, ఎలా వచ్చింది అనే వివరాలు తెలియడానికే యం. రామకృష్ణారెడ్డి శ్రీరామకృష్ణా ఆర్ట్స్ పతాకంక్రింద "వైకుంఠపాళి" చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కె.బాపయ్యదర్శకుడు.



"అమ్మాయిల శపథం"లో
రామకృష్ణ, సత్యనారాయణ, చంద్రమోహన్



"మావూరి గంగ"లో జగ్గయ్య, లక్ష్మి

శోభన్‌బాబు నటించే చిత్రాలు

వచ్చే మార్చినాటికి శోభన్‌బాబు నటించిన అయిదు చిత్రాలు పూర్తవుతాయి. అవేమిటన. "బాబు, బలిపీఠం, జీవనజ్యోతి, అందరూ మంచివారే, జేబుదొంగ." ఈ అయిదూ ఆయన అంతస్తును పెంచగలవన్న నమ్మకం పరిశ్రమ వాసులకు వున్నది. ప్రేక్షకులు యీ అయిదింటినీ వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

ఏప్రిల్ నుండి కొత్తచిత్రాల షూటింగులు ప్రారంభమవుతాయి. జగపతి స్టాఫ్ ఎంటర్‌ప్రైజస్, పల్లవి ఆర్ట్స్, సురేష్ మూవీస్, రవి శంకర్ ఆర్ట్ పిక్చర్స్, నవత ఆర్ట్స్, శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్, ఏ. వి. ఎమ్. చిత్రాలలో నటించడానికి నిర్మాతలు కాల్‌షీట్లు పుచ్చుకొన్నారు.

ప్రేక్షకులకు అతి సన్నిహితంగా వస్తున్న శోభన్‌బాబు మరో దశాబ్దంపాటు "టాప్ త్రీ"లో ఒకరుగా వుండడం తథ్యము అన్నది నా నిశ్చితాభిప్రాయం.

ఎందరికో ఆయనతో తీయాలనివుంది. అందరినీ సంతృప్తిపరచడం సాధ్యమా? సాధ్యమైనంత వరకు మంచి కథలనే ఎన్నుకొంటున్న శోభన్‌కు తిరుగులేదు.

స్వర్గం - నరకం

శ్రీ లక్ష్మీనరసింహా ఫిలింస్ నిర్మించే చిత్రం పేరు యిది అని నిర్మాత మావుళ్లయ్య చెప్పారు. కథను దాసరి యిచ్చినట్లు, మాటలను ఆయనే సమకూరుస్తున్నట్లు, సినిమా విధానాన్ని, దర్శకత్వాన్ని నారాయణరావు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మార్చి ఆరున మంచి రోజని పాటకు ముహూర్తం పెట్టారట. ఈ చిత్రానికి సత్యం సంగీతసారథి.

ఏప్రిల్ యిరవైనాలుగున షూటింగు ప్రారంభమవుతుందని మరొక నిర్మాత భాస్కరరావు చెప్పారు.

ఈ చిత్రంలో రోజారమణి, మురళీమోహన్ ముఖ్య పాత్రలను పోషించగలరని తెలుస్తోంది. బి. రామతారకం సమర్పించు సమస్యాత్మక చిత్రం "స్వర్గం—నరకం."

అదే పాట ఎంతబాగున్నది?

గజలక్ష్మి చిత్ర "యాదోంకి బారాత్" హిందీ చిత్రాన్ని యథాతథంగా తెలుగులో పునర్నిస్తున్నారన్న వార్త పాఠకులకు తెలిపియున్నాను.

ఆ చిత్రం యొక్క "థీమ్ సాంగ్"ను డాక్టర్. నారాయణరెడ్డి రాశారు. అదేమిటన.

"ఆనాటి హృదయాల ఆనంద గీతం! ఇదేలే!
ఈనాడు నయనాల విరిసే వసంతం! అదేలే!
ఆ పాట అధరాలపైన
పలికేను ఏనాటికైనా!" ఈ పాటను సుశీల సుమధురంగా పాడింది. విన్నవాళ్లంతా "ఓహో... ఓహో" అన్నారు.

అదే పాటను, హిందీ చిత్రంలో విన్నవాళ్లు బలే బలేగా వుందన్నారు. తెలుగులో అదే ట్యూనును అనుసరించారు. ఈ చిత్రానికి చక్రవర్తి సంగీత దర్శకుడు.

"నటరత్న" హీరోగా నటిస్తున్న యీ వర్ణ చిత్రం షూటింగు మార్చి ఒకటినుండి ఏకధాటిగా రెండున్నర మాసాలు జరుగుతుంది. ఈ చిత్రానికి ఎస్. డి. లాల్ దర్శకుడు. హిందీ చిత్రం సాధించిన విజయాన్ని తెలుగు చవిచూడడం తథ్యము అన్నారాయన.

నాడు - నేడు

ఇది చేతనా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న రెండవ చిత్రానికి పెట్టిన పేరు. ఈ సంస్థ యిదివరకు "గీత" చిత్రాన్ని నిర్మించి, సంచలనం సృష్టించిందనే విషయం అందరికీ విదితమే. చాలాకాలానికి మళ్లీ "నాడు—నేడు" అనే ప్రబోధాత్మక చిత్రాన్ని తయారు చేస్తోందిపుడు.

నాగరికత ప్రబలకముందు మానవుల్లో భాష, వస్త్రధారణ, వ్యవసాయ విధానం, మున్నగు పెక్కు ప్రక్రియలు ఎలా వుండేవి? నేటి నాగరికతకు, ఆనాటి అనాగరికతకు గల వ్యత్యాసం ఏమిటి? మున్నగు విషయాలను పాత్రల ద్వారా స్పష్టీకరణ చేస్తూ నిర్మింపబడుతున్న చిత్రమే "నాడు—నేడు."

ఇప్పటికే అయిదురీళ్లు తయారైన యీ చిత్రానికి సత్యం సంగీతాన్ని, పి. యస్. ప్రకాష్ ఛాయను, వాలి కళను, మోహన్ కూర్పును సమకూరుస్తున్నారు. రామకృష్ణ, ప్రసాద్‌బాబు, (గీత ఫేమ్) త్యాగరాజు, రవి, ముక్కామల, కె. వి. చలం, కోళ్ల సత్యం, హలం, రాజేశ్వరి, వాణి, ఉష, జయకుమారి, మారుతీ సుబ్బారావు ముఖ్య పాత్రలను పోషిస్తున్న ఈ చిత్రాన్ని కొఠారి, శేఖర్‌లు నిర్మిస్తున్నారు. రూపరాజ్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని నిర్మాతల్లో ఒకరైన శేఖర్ డైరెక్టు చేస్తున్నారు.



సినీమాతార 'భారతి'కి కన్నడ నటుడు విష్ణువర్ధన్‌కి ఫిబ్రవరి 27వ తేదీనాడు బెంగుళూరులో వైభవంగా వివాహంజరిగింది. ఆ సందర్భంలో తీసిన ఛాయా చిత్రం.
(ఫొటో పంపినవారు : ఎమ్. విశ్వనాథ్)



''మాయింటి దేవుడు''లో విజయలలిత

జమున, లతల తారతమ్యం !

పరిస్థితులకు లొంగిపోయి కొందరు వనితలు పతితలౌతుంటారు. కానీ కొందరు మనుషులు పరిస్థితులెంత తిరగబడినా, తలవొంచక, స్త్రీ జాతికి పెన్నిధి అయిన శీలాన్ని కాపాడుకుంటారు. తియ్యటి మాటలకు బానిసలై, బ్రతుకునే నరకం చేసుకుంటారు కొందరు అతివలు. ప్రాణాన్నైనా త్యజించడానికి తెగిస్తారుకానీ, మానాన్ని అమ్మకోలేరు యింకొందరు స్త్రీలు. ఇలా రెండురకాల

సినిమా

మనుషుల జీవిత దృష్టాంతసారమే మహారంజనీ పిక్చర్స్ వారి ''భారతి'' చిత్రం.

ఆశలకు లొంగిపోయి, చమక్కులకు చెదిరిపోయి, పెళ్లి కాకుండానే తప్పటడుగువేసిన లత, (మీనా) పరిస్థితులెంత పగబట్టినా, బెదిరిపోక, ఆడజాతికి అతి ముఖ్యమైన శీలాన్ని అడుగడుగునా రక్షించుకునే స్త్రీగా జమున (భారతి) ఆ పాత్రలకు పరిపూర్ణ న్యాయం చేకూర్చారు. మహానటులు రంగారావుగారు భారతి తండ్రిగా, నాటకరంగంలో వాసికెక్కిన కళాకారులుగా గొప్పగా చేశారు. చిత్రంలోని తదితర పాత్రలను కృష్ణంరాజు, సత్యనారాయణ, చంద్రమోహన్, పద్మనాభం, అల్లురామలింగయ్య, రమాప్రభ, నిర్మల, సురభి బాలసరస్వతి, సి. హెచ్. కృష్ణమూర్తి, కాశీనాథ్ తాతా పోషించారు.

కథ వ్రాసిన వీటూరే మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం నెరపినందున చిత్రం టెంపో ఎక్కడ తగ్గలేదు. వీటూరి తన తొలి ప్రయత్నంలో విజయం సాధించగలిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. కే. వి. కోదండపాణి సంగీతం వీనులవిందుగా ఉంది. ''కనిపించే దేవతలే తల్లిదండ్రులు'' అనే పాట పాపులర్ అయ్యే సూచనలున్నాయి. మొత్తానికి ఉత్తమ చిత్రాన్ని నిర్మించిన కె. వి. రెడ్డి అభినందనీయుడు. ఈ చిత్రం మార్చి 27 న విజయా ద్వారా ఆంధ్రా అంతటా విడుదలౌతుంది.

శోభన్‌బాబును అదరగొట్టిన అమ్మాయి

అది వాహినీ స్టుడియో రెండవ ఫ్లోర్. ఆ ఫ్లోర్‌లో శోభన్‌బాబు ఏదో దీర్ఘంగా ఆలోచించుకుంటూ ఓ కుర్చీలో కూర్చొని వున్నాడు. ఇంతలో ఎటునుంచో ఓ ఆడది అక్కడికి వచ్చి అతన్నిలా వేధించసాగింది. శోభన్ నిశిత చూపులు చూచి, ''ఏమిటి ఆ వాడి, వాడి, వేడి, వేడి చూపులు, యిప్పుడే అంతా అయిపోతే, రేపు స్టేజీమీద బాలెన్సు ఏముంటుంది? నా పోర్షన్ నాకిచ్చెయ్యండి, నేను ప్రాక్టీస్ చేసుకుంటాను అంది ఆ ఆడకంఠం.'' ఏం పోర్షన్ ? అంటూ ప్రశ్నార్థకరంగా చూశాడు శోభన్. ఆదే! మీరు సృష్టించిన నాటకంలోని కథానాయిక, అంటూ ''కల నిజమాయెనా! కోరిక తీరెనా! కథానాయిక నేనేగా! నేనే, నేనేగా!'' అనే పాటను పాడి ముఖం యిలా త్రిప్పింది. అంతవరకూ ఆడ వేషధారిణే ఎవరా అని చూస్తుండిన నాకు రాజబాబు ముఖం ఆ రూపంలో గోచరించింది. ఇంతలో కట్ అన్నారు దర్శకుడు విశ్వనాథ్.

పై గమ్మత్తైన సన్నివేశం డి. వి. యస్. ప్రొడక్షన్స్ వారి ''జీవన జ్యోతి'' లో కన్పిస్తుంది. అందరిని కవ్వించి, నవ్విస్తుంది. ఆడవేషంలో రాజబాబు అచ్చం అలాగే కన్పించి, ఆ సన్నివేశాన్ని రక్తికట్టించాడు.

రంగుల్లో రమణీయంగా, రసవత్తరంగా రూపొందుతున్న ''జీవన జ్యోతి'' చిత్రానికి మహదేవన్ సుమధుర సంగీతం, సముద్రాల మాటల మహాత్మ్యం, జె. కె. రాము కెమెరా కౌశలం, కళాధర్ కళానైపుణ్యం ఎంతో సహకరిస్తున్నాయనడం సత్యదూరం కానేరదు. డి. వి. యస్. రాజుగారు పెద్దయెత్తున నిర్మిస్తున్న ఈ చిత్రం విజయా ద్వారా ఉగాదికి విడుదలౌతుంది. కె. రామలక్ష్మి విరచితమైన ''ఆడది'' నవల ''జీవనజ్యోతి'' చిత్రానికి మూలం. కె. విశ్వనాథ్ విజయపరంపరలకు మరో మచ్చుతునక ''జీవనజ్యోతి.'' వాణిశ్రీ ఈ చిత్రంలో హీరోయిన్. పైగా ద్విపాత్రాభినయం.

''స్వతంత్రం వచ్చింది'' రాజబాబు, ప్రభ



''వైకుంఠపాళి'' రంగనాథ్, విజయ





అందరూ మంచివారే !

జెమినీ బాలన్ దర్శకత్వంలో దర్జాగా రూపొందించబడిన "అందరూ మంచివారే" చిత్రం శోభన్ బాబు హిట్ చిత్రాల లిస్టులో చేరగల అవకాశం ఎంతేని వున్నట్టు వివరం తెలిసిన వ్యక్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో శోభన్ ధరించిన వేషం చిన్నదే కావచ్చుగాని, పతాక సన్నివేశంలో ఆయన నటన ఆహా అన్నట్టుగా వున్నదట.

జెమినీ బాలన్ తన చిత్రంకోసం ఒక గ్రామాన్ని సృష్టించారు: కలశాపురంలో వెలసిన ఆ గ్రామానికి జెమినీ కాలనీ అని పేరు పెట్టారు. అక్కడి పాఠశాలవిస్తరణనిమిత్తం రు. 37,500యిచ్చారు. నీటి వసతిని ఏర్పరచారు.

తెలుగు సంవత్సరాదినాడు యీ వర్ణ చిత్రం రాబోతున్నది. కొత్తదనంవున్న యీ చిత్రానికి ప్రేక్షకాదరణ లభించగలదు. ఇందులో త్యాగరాజుకు బలే పాత్ర లభించింది. అతడు బలే భలేగా చేసినట్టు వార్త. ఇతర పాత్రలను లోకేష్, మంజుల, జయంతి, ధూళిపాళ, నీరజ, కె. ఏ. చలం, సాక్షి రంగారావు పోషించారు. "దేశ సౌభాగ్యానికి గ్రామ సీమలే పట్టుకొమ్మలు" అని చాటిచెప్పే "అందరూ మంచివారే" చిత్రానికి కువాక్ సంగీతం యస్సెట్ అంటున్నారు. మంచిని పెంచి, మంచిని ఆశించే మంచి మనసున్న బాలన్‌కు ప్రేక్షకులు మంచి ఫలితాన్ని యివ్వగలరు. నవయుగ విడుదల.

అల్లు వేసిన పోస్టుమాష్టరుగిరి

"చల్లని తల్లి" చిత్రంలో నీలకంఠం పాత్రను పోషించాడు అల్లు రామలింగయ్య. ఆ పాత్ర స్వభావం ఎలాంటిదన, పేరాశ ప్రేగుల్లో పేరుకుపోగా, బంధు పాశాన్నిగూడా పరుక్కుపోయే స్వభావం నీలకంఠంది. పల్లెటూరి పోస్టుమాష్టర్‌గా వుంటూనే, తన కుయుక్తులతో పల్లె జనాన్ని మోసగిస్తుంటాడు నీలకంఠం. వేలిముద్రలేసే అమాయకుల్ని తేలికగా మోసగించడంలో చతురుడు. చిన్న చిన్న మొత్తాల్ని వడ్డీలకిచ్చి, అమాయకుల్ని మోసగిస్తూ డబ్బు సంపాదిస్తుంటాడు.

పోస్ట్‌మాష్టర్‌గిరీ ఊడటంతో వరహాలు అనే వ్యక్తివద్ద ఉద్యోగానికి చేరుతాడు. చెడు అనే పదం పేరు తెలియని వరహాల్ని చెడ్డదారి పట్టించాడు. ఉపకారం చేసిన "చల్లని తల్లి" అంజలీదేవికే అపకారం చేయమని పురికొల్పుతాడు వరహాల్ని. చావుబ్రతుకుల్లో వున్న "చల్లని తల్లి"ని శాశ్వతంగా చంపేయమని నర్సుకు లంచ మిప్పిస్తాడు. నీలకంఠం తాను చేసిన పై అకృత్యాలకు పశ్చాత్తాప పడ్డాడా? ఎలాంటి శిక్ష ననుభవించాడు? అనే వివరాలుతెల్సుకోన డానికే లలితా మూవీస్ "చల్లని తల్లి" చిత్రం తయారు చేసింది. జి. జగదీష్ చంద్రప్రసాద్ నిర్మించిన పై చిత్రానికి కె. ఎస్. రామిరెడ్డి దర్శకుడు. డి. మధుసూదనరావుగారు కథ సమకూర్చి, సమర్పిస్తున్న ఈ చిత్రానికి రాజేశ్వరరావు సంగీతం, సెల్వరాజ్ ఛాయ, చలం కళ, మణి కూర్పు ఎంతో శోభను చేకూర్చాయి అని విడుదల అనంతరం మీరే అంటారు.

"బ్రతుకే ఒక పండుగ"లో భవాని, సత్యప్రియ



ఎడిటరుకు మరో చిత్రం

"పల్లెపడుచు", "ఇంటింటి కథ" చిత్రాలకు దర్శకత్వం నెరపిన ఎడిటరు సత్యం ఇప్పుడు మరో చిత్రాన్ని డైరెక్ట్ చేయబోతున్నారు. సుజన పిక్చర్స్ అనే నూతన సంస్థ నిర్మించబోయే చిత్రానికి కె. సత్యం దర్శకుడు.

అగ్రశ్రేణి నటీ నటులతోబాటు, కొందరు కొత్తవాళ్ళ ముఖ్య పాత్రలను పోషించనున్న ఈ చిత్రం షూటింగ్ మే నెల నుంచి ఆరంభమౌతుంది. ఏప్రిల్‌లో కొన్ని పాటలను రికార్డ్ చేయదలచినట్టు చెప్పారు నిర్మాణ నిర్వాహకుడు తాతాజీ. ఛాయాగ్రహణానికి థామస్‌ను, సంగీతానికి రాజేశ్వరరావును, మాటల రచనకు దాసం గోపాలకృష్ణను ఎంపిక చేసారిప్పటికి.

సత్యం చెప్పిన సంగతులు

ఎడిటింగ్ శాఖలో విశేషానుభవం గడించిన సత్యాన్ని కూర్పుకు, దర్శకత్వానికి గల పొత్తు ఎలాంటిదని ప్రశ్నించగా అతనిచ్చిన జవాబు ఇలా వుంది. "దర్శకత్వానికి, కూర్పుకు దగ్గర సంబంధం వుంది. ఎడిటరుకు చిత్రీకరణను గురించి బాగా తెలిసివుండాలి. రచయిత సృష్టించిన కథలోని పటుత్వాన్ని పట్టు తప్పనీయక నడిపించడం దర్శకుని ధర్మం. దర్శకుని, కథకుని మనోభావాలను గుర్తించి, కథను బాగా పరిశీలించి, లింకు చెడిపోకుండా, వారిద్దరి సమన్వయ కృషికి ఓ నిండైన రూపాన్ని తీసుకురావడమే ఎడిటరు కర్తవ్యం."

— శ్రీనివాస్

సీరియల్
అహం–అనురాగం
జి. పరిమళా సోమేశ్వర్

(గత సంచిక తరువాయి)

అప్పటినుండి అశ్వని సంభాషణలు వ్రాసిన సినిమాలన్నిటికీ ఒకటో, రెండో పాటలు రవి వ్రాసిచ్చేవాడు. రవి పాటలు వాళ్ళకు నచ్చటమేకాక అశ్వని సిఫార్సు కూడా వాళ్ళా పాటలను అంగీకరించటానికి ఒక కారణం అయింది. ఆ సంగతి రవి కూడా గ్రహించేడు. రవి 'కవిత' అన్న కలం పేరుతో వ్రాసిన పాటలన్నీ ప్రజాదరణను పుష్కలంగా పొందటంతో చాలామంది నిర్మాతలు అతనిచుట్టూ తిరగసాగేరు. రెండు సంవత్సరాలు గడిచేసరికి రవి 'కవిత'గా కావలసినంత కీర్తిని గడించేడు.

ఈ సినిమారంగమే ఒక లాటరీ. కేవలం నిర్మాతలు, నటీనటుల విషయంలోనేకాక అందరి విషయంలో కూడా అదృష్టం, దురదృష్టంకూడా అదేపనిగా అంటిపెట్టుకుని ఉంటయ్ ఆ రంగానికి సంబంధించినవాళ్ళను.

ఆఖరికి రచయితగాని కవిగాని ఒకసారి వెలుగులోకి వచ్చేరంటేచాలు కొన్ని సంవత్సరాల వరకు అతని స్థానం సుస్థిరంగా ఉంటుందనటంలో సందేహం లేదు. తనకి లభిస్తున్న ప్రోత్సాహాన్ని చూసి కొండంత బలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పొందిన రవి అశ్వనితో సంప్రదించి ఒక సినిమాకు సంభాషణలు కూడా వ్రాయటం ప్రారంభించేడు.

అతను వ్రాసినదానికి అశ్వని సూచనలు, సలహాలతో కొన్ని మార్పులుచేసి నిర్మాతకిచ్చేడు. ఆ సినిమావల్ల నిర్మాత బాగా డబ్బు సంపాదించేడు. రవి వ్రాసిన సంభాషణలలో ఒకరకమైన కొత్తదనం ఉండటంవల్ల ప్రజలను బాగా ఆకర్షించగలిగినయ్. సాధారణంగా ప్రేక్షకులు "ఫలానా సన్నివేశంలోని సంభాషణలో ఫలానా పదాలు దొర్లుతాయి" అని ముందే వూహించుకోవటం యీమధ్య పరిపాటయిపోయింది. అలాటి పరిస్థితులలో మిగతావారికన్న భిన్నంగా రవి వ్రాయటం మొదటినుండి చివరివరకు ప్రతి వాక్యంలోనూ సున్నితమైన హాస్యం తొంగి చూడటం, ప్రేక్షకులకు బాగా నచ్చింది.

ఆ సినిమాను చూసిన తరువాత అశ్వని కూడా రవిని మెచ్చుకున్నాడు. "నన్ను మించిపోయేటట్లున్నావోయ్" అన్నాడు.

రవి నవ్వేడు.

అతనికి కొంచెం చేతిలో డబ్బు నిలవ వుండటం ప్రారంభించేక అశ్వనితో "ఇకనుండి మన రూముకి అద్దెను నేనే కడతాను" అన్నాడు.

"ఐతే ఋణం తీర్చుకోవటం ప్రారంభించేవన్నమాట !" అన్నాడు అశ్వని.

"అలా అనకండి. మీ ఋణాన్ని యెన్నటికీ తీర్చుకోలేను. మీమీద ఆధారపడటంవల్ల మీకు ఎలాటి యిబ్బందీ వుండదని, మీరేమీ అనుకోరనీ నాకు తెలుసు. కాని లోకంకోసం, నా ఆత్మ సంతృప్తికోసం నన్నుకూడా మీతోపాటు కొంత డబ్బు ఖర్చుపెట్టనీయండి." అన్నాడు రవి.

"సరే. నీ యిష్టంవచ్చినట్లే కానీయ్. నేను మాత్రం యింత డబ్బు సంపాదిస్తున్నాను. చివరికి ఏం చేసుకోను ? పిల్లా, జెల్లా ? అందుకే ఇష్టమొచ్చినట్లు ఖర్చుపెట్టేస్తాను. నీలాటి యోగ్యులైన వారికోసం ఖర్చుపెడితే ఆ డబ్బుకి సార్థకత లభిస్తుంది. అయినప్పటికీ నీ మనసు మార్చుకోసంటావా, ఆ తరువాత నీ యిష్టం" అన్నాడు అశ్వని.

ఇక రవికి అతనిని కాదనే శక్తి లేకపోయింది.

"మీకు పిల్లాజెల్లా లేకపోయినా మీకోసమైనా కొంత డబ్బు నిలవ ఉంచుకోవాలికదా అశ్వనిబాబూ! ఈ రోజు ఆరోగ్యంగా ఉన్నారు కనుక వ్రాస్తున్నారు. సంపాదిస్తున్నారు. కాని అన్ని రోజులూ మనవి కాదు. రేపు మీ ఆరోగ్యం బాగా ఉండకపోవచ్చు. బాగా ఉన్నా ఏ కారణంచేతనైనా మీ రచనలను నిర్మాతలు తీసుకోకపోవచ్చు. అప్పుడు మీరు ఏ ఆధారంతో జీవిస్తారు ? కనీసం మీ దగ్గర డబ్బు అనేది ఉంటే ఆ డబ్బును చూసైనా ముసలితనంలో మీకు ఎవరైనా సేవలు చేస్తారు. లేకపోతే మీ మంచితనం కూడా మిమ్మల్ని కాపాడలేదు. డబ్బు లేని పురుషుడిని కట్టుకున్న భార్య, కడుపున పుట్టిన బిడ్డలు కూడా గౌరవించరు అశ్వనిబాబూ ! డబ్బు విలువ తెలిసినవారైతే మీరింత బాధ్యతారహితంగా ఖర్చు పెట్టేవారు కాదు" అన్నాడు.

జరిగిన కథ 16 : స్త్రీల కళాశాల లెక్చరర్ శ్యామల, విద్యార్థినులతో నెహ్రూ జూలాజికల్ పార్కుకు వెళ్ళివచ్చి, అక్కడ తనను ప్రమాదం నుంచి కాపాడిన వ్యక్తి బి. ఎ. తప్పిన పేద నిరుద్యోగి అతనిద్వారా తెలుసుకుంటుంది. చంద్రను పెళ్ళి చేసుకోవటానికి కూతురు శ్యామల నిరాకరించగా దిగులుతో ఆరోగ్యం చెడి మరణిస్తారు వెంకటేశ్వరరావుగారు. చంద్ర హెచ్చరిక లెక్కచేయక రవినే వివాహం చేసుకుంటుంది శ్యామల. అయిష్టంగా బి. ఏ. పరీక్షకు కట్టి తప్పుతాడు రవి. వుద్యోగం పోయి మానసికంగా దిగజారిపోయిన రవి – శ్యామల తొందరపాటు తనంవల్ల ఇల్లు విడిచి వెళ్ళిపోతాడు. తన తొందరపాటుకు పశ్చాత్తాప పడ్డ శ్యామల రవి కుటుంబాన్ని ఆదరిస్తుంది. మద్రాసు బయల్దేరిన రవికి రైల్లో పరిచయమయిన సినీ రచయిత అశ్వనిబాబు ఆశ్రయం లభిస్తుంది. ఆడబిడ్డ లక్ష్మి ప్రేమించిన రాజా కపట ప్రవర్తనను ఆమెకు తెలియచేసిన శ్యామల వర్ణాంతర వివాహం చేసుకున్న మరది రఘు రాధలను ఆదరిస్తుంది. తన ప్రవర్తనకు పశ్చాత్తాపపడ్డ చంద్ర శ్యామల పరిస్థితికి జాలిపడతాడు.

అశ్వని అతనివంక చిత్రంగా చూసేడు. "ఏమిటోయ్ యీరోజు కొత్తగా మాట్లాడుతున్నావు? భార్యా బిడ్డల సంగతి యేమోకాని ఎట్టి పరిస్థితులలోనైనా నువ్వు నన్ను వదిలిపెట్టవని నా అంతరాత్మ చెప్తోంది. నా అంతరాత్మ చెప్పేది నిజమా కాదా ?"

రవి చెమ్మగిలిన కళ్ళతో అతనివంక చూస్తూ అన్నాడు "మీకు నామీద గల నమ్మకానికి కృతజ్ఞుడను. మీరు నాకు చేసిన మేలుకి, సహాయానికి నా చర్మంతో మీకు చెప్పులు కుట్టించినా మీ ఋణం తీరదు."

"మరీ అంతంత పెద్ద మాటలనకోయ్. నాకు సిగ్గేస్తుంది. క్రింది మెట్టుమీద ఉన్నవాడికి పైమెట్టుమీద ఉన్న నేను కాస్త చెయ్యి అందించేను. అంతే. ఆ పైన మెట్లన్నీ ఎక్కి నువ్వే పైకి పోతున్నావు. ఇందులో నా గొప్పతనమేముంది? అంతా నీ ప్రతిభ, పట్టుదలా." అన్నాడు అశ్వని.

"ఐతే మీరు నేను చెప్పినట్లు వినాలి" అన్నాడు రవి.

"ఏమిటి ? తాగుడు మానమంటావా, యేమిటి కొంపతీసి ? అది తప్ప ఏం చెయ్యమన్నా చేస్తాను."

"మీ కంత యిష్టంలేని పనిని మీచేత ఎన్నడూ చేయించను. అలా చేయించటం నా స్వభావానికే విరుద్ధం."

"ఐతే మరేమిటో చెప్పు. తప్పకుండా చేస్తాను."

"ఇకనుండి మీకు వచ్చే డబ్బుని నా చేతికివ్వండి. మీకు నెలకు ఎంత కావాలో అడిగి తీసుకోండి. మిగతాది మీ పేర బ్యాంకులో వేస్తాను. దీపముండగానే యిల్లు చక్కబెట్టుకోవాలి అని మీకు తెలియదా ? మీరు సంపాదిస్తున్న తరుణంలోనే కొంత దాచుకుంటే మీకు భవిష్యత్తులో అది ఎంతగానో ఉపయోగపడుతుంది."

"ఓశ్ ! అంతేకదా ! ఇంకా యేమిటో అనుకున్నాను. నువ్వు నాకు డబ్బుమీద ప్రలోభం కలిగేట్లు చెయ్యటానికి ప్రయత్నిస్తున్నావన్న మాట ! సరే. నీ యిష్టంవచ్చినట్లు కానీయ్" అన్నాడు.

అప్పటినుండి రవి అశ్వని ఖర్చులకోసం నెలకి వెయ్యికి మించకుండా ఉంచి మిగతా డబ్బును బ్యాంకులో వెయ్యటం ప్రారంభించేడు.

అశ్వనికి త్రాగుడు తప్ప మరేం ఖర్చులు లేవు. ఒక్కోసారి విపరీతంగా త్రాగితే వెయ్యికి పైనే ఖర్చయేది. అలాటప్పుడు తన చేతిలోనుండి ఖర్చుపెట్టేవాడు రవి. బ్యాంకులోనుండి మాత్రం ఒక్క పైసాకూడా కదిలించేవాడు కాదు. అది గ్రహించిన అశ్వని తన త్రాగుడు ఖర్చులు అన్ని ఖర్చులూ కలిపి వెయ్యికి మించకుండా చూసుకునేవాడు.

అంతేకాదు. తనకున్న పేరునుబట్టి నిర్మాతలు తనకోసం ఎగబడుతున్నకొలదీ వాళ్ళను యిదివరకటి కంటె ఐదు వేలు ఎక్కువ యిమ్మనికూడా అడగటం ప్రారంభించేడు. పెద్ద పెద్ద నిర్మాతలు, యివ్వగలరనుకున్న వాళ్ళదగ్గర యిరవై వేలు తీసుకోనిదే కలం పట్టుకునేవాడు కాదు.

కాని అతని ధర పెరిగేకొలదీ చిత్రంగా అతని డిమాండుకూడా పెరగసాగింది.

అలా మూడు సంవత్సరాలు సినీ రచయితలలో మకుటం లేని రాజులా వెలిగిపోయేడు అశ్వని.

అతనిని నీడలా అంటిపెట్టుకు తిరుగుతున్న రవి కూడా అతనిలాగానే వృద్ధిలోకి రాసాగేడు. అశ్విని లేని సినిమాలలో మూడువంతులు రవే ఉండేవాడు. అలా ఐదారు సంవత్సరాలు గడచేసరికి అతని ఆస్తి లక్షదాకా వచ్చింది. అది కేవలం క్యాష్ రూపంలోనే లేదు. రవి ఏభై వేలు సంపాదించిన తరువాత రెండు చిన్నకారులు కొన్నాడు. వాటిని అద్దెకు యివ్వటం మొదలెట్టి రెండు సంవత్సరాలు గడిచేసరికి ఆ డబ్బుతో మరొక కారు కొన్నాడు. అలా ఓవక్క ఆస్తిని అభివృద్ధి చేసుకుంటున్న రవికి యింటిమీద మనసుపోక పోలేదు. తన ఆస్తి లక్ష దాటిన తరువాతగాని ఆ యింటి గడప తొక్కకూడదని ఒట్టు పెట్టుకోవటంవల్ల మరికొన్ని నెలలు వేచివుండవలసి వచ్చింది.

ఇంతలో హఠాత్తుగా అశ్వినికి కాన్సరు జబ్బు వున్నట్లు తేలింది. డాక్టర్లు ఓవక్క వైద్యం చేస్తుంటే మరోవంక అశ్విని త్రాగుడు మానక పోవటం, పైగా మామూలుప్రకారంగా తాగటం వల్ల ఆ జబ్బు ముదిరి అతనిని చాలా ప్రమాద స్థితికి తీసుకుపోయింది.

రెండు మూడు నెలల కంటె ఎక్కువ అతను బ్రతకడని డాక్టర్లు చెప్పేరు. రవికి ఆ వార్త వింటూనే నవనాడులూ క్రుంగిపోయినయ్. తన రక్తం పంచుకుపుట్టిన సోదరుడే దూరమవుతున్నంతగా విలపించేడు. అశ్వినే తనకి పరిచయం కాకపోతే తనీనాడు ఎలాటి స్థితిలో వుండేవాడో తలచుకోవటానికే భయం వేస్తుంది రవికి. రోడ్డుమీద అడుక్కుతింటూ సత్రంలో పడుకుంటూ ఎంత నికృష్టమైన జీవితాన్ని గడపవలసి వచ్చేదో!

తనకి నిజమైన జీవితాన్ని ప్రసాదించింది అశ్వినే! అందుకే అశ్వినికి స్వయంగా దగ్గరుండి సేవలు చెయ్యసాగేడు రవి.

రవి తనమీద చూపుతున్న అభిమానాన్ని చూసి అశ్విని కళ్లల్లో నీళ్లు తిరిగేవి. "రవీ! ఆ రోజుల్లో మాటిమాటికి "నీ ఋణం తీర్చుకోలేను" అనేవాడివి. ఇప్పుడు యీరకంగా తీర్చుకుంటున్నావా?" అనేవాడు.

"ఈ రకంగానే కాదు. ఏ రకంగానూ మీ ఋణం తీర్చుకోలేను నేను." అన్నాడు రవి.

"లేదు. నువ్వుగనుక యిలాగే రాత్రింబవళ్లు నాకు సేవలు చేసేవంటే నేనే నీకు ఋణపడి వుండవలసి వస్తుంది. కాని తిరిగి ఆ ఋణం తీర్చుకోవటానికి నేను బ్రతికివుండనుకదా. అందుకే త్వరగా చచ్చిపోయి నీ కడుపున పుడతాను. త్వరగా పెళ్లిచేసుకో రవీ!" అన్నాడు అశ్విని.

"అలాగే!" అంటూ ముఖం పక్కకు తిప్పుకున్నాడు రవి.

మరోరోజు "రవీ! ఈ తాళంచెవి తీసుకో. ఇది నా సూట్‌కేసుది. అందులో నా వీలునామా, ఒక ఉత్తరం వున్నాయి. నేను చనిపోయే వరకు ఆ సూటుకేసు తెరవవద్దు. చనిపోయిన తరువాతనే తెరువు. ఏ క్షణంలో కన్నుమూస్తానో, ఆ సూట్‌కేసు సంగతి నీకు తెలియదుకదా అని యిప్పుడే చెప్తున్నాను" అన్నాడు అశ్విని.



ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

జి. కె. పి. వంశధార

భోజనానికి కూర్చున్నాక మొదటి ముద్దను కళ్లకద్దుకొని మరీ తింటారు. ఎందుకు ?

★ గ్రేస్ చెప్పడం-ఇండియన్ స్టయిల్... యీ పూటకీ అన్నం యిచ్చిన భగవంతుడిని ధ్యానించడంలో తప్పులేదు. (భగవంతుడనేవాడు లేడనే వారైతే — ఎవరి అన్నం తింటుంటే వాళ్లకే కృతజ్ఞత చెప్పడం అనుకోండి.)

పి. ఎస్. రాజమండ్రి

భగవంతుడు మనకివ్వని దేది ?

★ అన్నీ పుష్కలంగా యిచ్చి కాస్త బుద్ధి తక్కువ యిచ్చాడు సోదరీ. వయస్సుతోపాటు, అనుభవంతోపాటు దాన్ని పెంచుకుంటామని.

భాస్కర్. విశాఖపట్నం

గ్రంథాలయాలలో మీ పేరు కూడా తెలియక రచనలు దొరుకుట లేదు. మాలతీ చందూర్, రంగనాయకమ్మల ముందు మీరు నల్లపూస. అవగింజ. ముందు మీ ఉన్నతి, స్థితి గ్రహించి ప్రసంగాలు చెయ్యండి.

★ నీలాంటి పిచ్చివాళ్లుంటారనే నాకు విశాఖపట్నం రావడం అంటే భయం భాస్కరా (రాయని !) ... నిజంగానే మాలతి అనుభవంముందు రంగ ధాటిముందు నేను — నలకని, నల్లపూసని. ఒప్పుకుంటున్నానుగా ! నేను వాళ్లకంటే పుష్పతు రాలినని ఎక్కడా అనలేదే.

వై. ఎస్. ఆర్. హైద్రాబాదు

స్త్రీ పురుషునికి ఎట్టి పరిస్థితులలోను సమానము కాదు.

★ మరింకెందుకీ తుచ్ఛజీవితం. ఈ భూమి పంచుకోడం ? వెళ్లి గంగలో ఉరక్క.

సి హెచ్. ఎల్. ఎస్. ఆర్. గుడుగుంట్లపాలెం

మీరు మగవారిని విమర్శించినంత మాత్రాన స్త్రీజాతి కేదో మేలు చేస్తున్నట్టు వారి నుద్ధరించడానికి కంకణం కట్టుకున్నట్టు — స్త్రీలు తమకేదో మేలు చేస్తున్నట్టు అనుకోడానికి కాబోలు...

★ పొరపాటు రావుగారూ, స్త్రీజాతే కాదు — ఏ జాతి అయినా తమని తాము ఉద్ధరించుకోవాలని తహతహలాడకపోతే — ఆ జాతిని ఎవరూ వుద్ధరించలేరన్న ప్రాథమిక సూత్రం కూడా తెలియనంత చిన్నపిల్లని కాను.

కె. ఎస్. పి. నెల్లూరు

మనిషికి ఓర్పు చాలా అవసరం అంటారు. కాని మీరు దెబ్బకు దెబ్బ అనే మనస్తత్వాన్ని నిరూపించే మీ జవాబుల్లో అదేం కనిపించదు. ఎందుకని ?

★ నాకంత చచ్చు ఓర్పు లేదు. ఓ చెంప లెంపకాయ కొడితే యింకో చెంప చూపెట్టడానికి నేను — దేవుణ్ని కాదు. దేవుడికి కంటే ఈ మనిషి దెయ్యానికి భయపడతాడన్న కిటుకు తెలిసినదాన్ని. దేవుణ్ని మనస్సులో ధ్యానించి దెయ్యానికే పట్టం కడతాను. (మనలో మనమాట: మనిషి అంటేఒక్క ఆడదేకాదు సార్—మనిషి అంటే ఆడ—మగ కూడ.)

ఎస్. ఎస్. ఆర్. విశాఖపట్నం

పవిత్ర ప్రేమకు నిదర్శనం ఏమిటి ?

★ పవిత్రమైనవాటికి నిదర్శనాలు చూపవలసిన గతి పడితే — అవి పవిత్రం అని చెప్పకోనక్కరలేదు.

టి. ఆర్; ఎల్. ఎల్; టి. ఆర్. ఆర్.

మిర్యాలగూడ

ఈనాటి రచయితలు తమ రచనల్లో ఎక్కువ భాగం ప్రేమ గూర్చే రాస్తున్నారు. సంఘంలోని కుళ్లను బయటికి తీయడానికి ప్రయత్నించరేం ?

అహం —

"అలా మాట్లాడకండి. మీరు తప్పకుండా కోలుకుంటారు. మీ ఆరోగ్యం నయమయిన తరువాత మా యింటికి తీసుకువెళ్తాను. మీరు మాదగ్గరే వుండిపోదురుగాని" అన్నాడు రవి.

"మీ యింటికి నిజంగా నన్ను తీసుకుపోతావా ? అసలు నువ్వు మీయింటికి తిరిగి వెళ్లవేమోనని భయపడ్డాను ! ఫరవాలేదు. నువ్వు నేను భయపడినంత మొండివాడివి కాదు."

రవి తల వంచుకున్నాడు.

మళ్లీ ఆ సంభాషణ కొనసాగలేదు.

అశ్వని స్థితి నానాటికీ క్షీణించసాగింది. అతని జీవితం యింకా రోజులలోనే వున్నదని అందరికీ తెలిసింది. డాక్టర్లు ఏదో మందులిస్తున్నారే తప్ప వాటివల్ల ప్రయోజనం ఏమీవుండదని వారికీతెలుసు.


ఒకరోజు రవిని దగ్గర కూర్చోపెట్టుకుని అతని చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు అశ్వని "రవీ ! నువ్వు ఈ గదిలోకి నాతోపాటు ప్రవేశించిన రోజున మనం ఎవరి రహస్యాలను వాళ్లు మనసులోనే ఉంచుకుందామనీ, ఒకరి విషయాలను ఒకరు అడగవద్దనీ అన్నాను. గుర్తుందా ? మనిషి ఆరోగ్యంగా, చైతన్యవంతంగా ఉన్న సమయంలో కొన్ని బాధలు, రహస్యంగా మనసులో దాగిఉంటేనే అందంగా ఉంటయ్. విషాదంకూడా రహస్యంగా ఉన్నప్పుడు మనసుకు కొంత 'రిలీఫ్' కలుగుతుంది. ఆ రహస్యమైన ఆనందాన్ని పోగొట్టుకోవటం యిష్టంలేకనే ఆరోజు నేనలా అన్నాను. కాని యిప్పుడు నేను మృత్యుముఖంలో ఉన్నాను. పదిహేనేళ్లుగా — అంటే నాకు పాతిక సంవత్సరాల వయసప్పటినుండి భరిస్తున్న ఆ విషాదాన్ని యీ క్షణంలో మోయలేనేమోనని పిస్తోంది. నా శరీరానికీ, మనసుకీ కూడా యిప్పుడా శక్తి లేదు. అందుకే యీ ఆఖరి క్షణాలలో నా బాధను నీకు చెప్పకోవాలనిపిస్తోంది." ఆయాసపడుతూ ఆగిపోయేడు అశ్వని.

"మీరు విశ్రాంతి తీసుకొండి. తరువాత మాట్లాడుకుందాం" అన్నాడు రవి.

"కొద్ది రోజులలో శాశ్వతంగానే విశ్రాంతి తీసుకోబోతున్నానుగా. అందుకే కనీసం యిప్పుడైనా నన్ను మాట్లాడనీయ్ రవీ. నన్ను అడ్డగించకు."

రవి మౌనంగా కూర్చున్నాడు.

"నా గురించి తలా ఒక రకంగా అనుకుంటుంటే నువ్వు వినేఉంటావు. నన్ను అడగకపోయినా నా గురించి తెలుసుకోవాలని నీకూ కుతూహలంగా ఉండవచ్చు. నాకు తమ్ముడువైనా, స్నేహితుడివైనా నీవే ! నన్ను పూర్తిగా అర్థం చేసుకోగల వ్యక్తి, నేను చనిపోయిన తరువాత కూడా నా గురించి బాధపడగల వ్యక్తి నువ్వే ! అందుకే నీకు చెప్తాను. విను రవీ ! నాతో పరిచయమైన యీ యేడు సంవత్సరాలలోనూ నా శీలాన్ని గురించి నీకు ఎంతో మంచి అభిప్రాయం ఏర్పడి ఉంటుంది. కాని నిజంగా నువ్వనుకున్నంత గొప్పవాడిని కాను నేను. నేను ఒక వివాహితురాలైన స్త్రీని ప్రేమించేను. ఆమె భర్తకు తెలియకుండా ఆమెతో కొన్ని వందల రాత్రులు గడిపేను. ఒక పురుషుడి అర్ధాంగిని ప్రేమించటం, ఆమెతో శారీరక సంబంధం పెట్టుకోవటం, మన సమాజపు కట్టుబాట్ల దృష్టిలో, మన నీతి నియామాల పరిధిలో చూస్తే ఘోరమైన నేరమే ! కాదనను. కాని నాకు ఆమెమీద ప్రేమతోపాటు వెర్రి వ్యామోహం కూడా ఉండేది. అది తప్పని నా అంతరాత్మకి తెలిసినా నేనా బలహీనతను వదులుకోలేకపోయేను. దానికి తగ్గట్టు ఆమెకూడా తన ప్రవర్తన ద్వారా నన్ను ప్రోత్సహించిందే తప్ప నన్ను తిరస్కరించలేదు. కొన్నాళ్లు గడచిన తరువాత మా సంబంధం గురించి అందరికీ తెలిసిపోయింది. ఆఖరి కాసంగతి ఆమె భర్త చెవినకూడా పడింది. ఒక రోజు అతను నన్ను చంపటానికి కత్తినికూడా తీసుకువచ్చేడు. ఎలాగో పెనుగులాడి అతని చేతిలో



ప్రశ్నావళి

★ ఉన్నదాన్ని గురించి రాయడం ఎందుకు. లేని దాన్ని చెప్పకుందామని! అయినా కుళ్ళు కడిగి ఏం ప్రయోజనం? రూపుమాపలేమని తెలుసు.

కె. ఐ. రేబాల

ఆడవాళ్ళ బ్రతికేది పవిత్రమైన నడవడిలో. అది కొరవడినవాడు...

★ ఎవరు చెప్పారీ చిలకపలుకులు? అవతలి అర్ధభాగానికి చెల్లని ఏ నైతిక సూత్రాలూ—న్యాయ సమ్మతం కాదు. పవిత్రత ఆడవారికేకాదు — మగ వారికి కూడా వుండాలి.

ఎన్. వి. విజయవాడ

బ్రతకలేకుండా వున్నాను. ధైర్యంచేసి — చావలేకుండా వున్నాను. తీరా — చావబోతే — చావక పోతే అవమానంపాలు అవుతానేమో...

★ మన నేర చట్టాలు గమ్మత్తుగా వుంటాయి కదూ — అన్ని నేరాలకీ — నేరం చేసినందుకు శిక్ష పడుతుంది. ఆత్మహత్యా నేరానికి మటుకు — చావక బ్రతికితే శిక్ష! ... నీ అనుమానం ఆలోచించతగినదే నమ్మాయీ.

ఎమ్. ఏ. ఆర్. బుచ్చిరెడ్డిపాలెం

ఎండను వెన్నెలుగా మార్చిన చక్రవాకం, ఆ వెన్నెలనే తిని బ్రతికే చకోరం అంటే ఏమిటి అక్కా?

★ ఈ చక్రాలమీద స్పెషలిస్టు కోడూరి కౌసల్యాదేవి. ఆమెతో చర్చించు సోదరా.

జి. జె. ఆర్. యలమంచిలి

కె. రా. గారూ మీ మైండుకి ఏఏ ఎరువులు వాడతారు. కాస్త చెప్తుదూ?

★ ఏమిటి? మీ వూళ్ళో భూములకేకాక, మైండుకి కూడా ఎరువులుంటాయా?! తెలిసిందే కాదు. నేను సజ్జన సాంగత్యమనే ఎరువేగాని కెమికల్ ఎరువులు వాడను తమ్ముడూ.

డి. ఎస్. ఆర్. సిద్దిపేట

ఆడది తాను కాలుతూ యితరులకు వెల్గునిస్తుంది. మరి మగవాడు?

★ ఆ వెల్గులో యిల్లు చక్కబెట్టుకుంటాడు.

ఎమ్. జె. ఆర్. ఏలూరు

ఎన్నివిధాలుగా మీరు అసంతృప్తి ప్రకటించినా స్త్రీని తలమీద కెక్కించుకునేటంత ప్రబుద్ధులుండరు...

★ తొందరపడకండి. ఆ శివుడంతటివాడు చేశాడా పని. మానవమాత్రునికి అహం అడ్డొస్తుంది కనుక ఆలస్యం అవుతోంది.

వై. జి. ఆర్. నర్సీపట్నం

ప్రేమించడానికి ముందంజవేసే యువతీ యువకులు పెళ్ళి చేసుకోడానికి వెనుకంజ వేస్తారెందుకు?

★ ప్రేమించడానికి పెట్టుబడి అక్కరలేదు. పెళ్ళి చేసుకుందుకు కావాలి.

ఎన్. యస్. ఎమ్. పచ్చలతాడిపర్రు

సమాన హక్కులనే వున్మాదంలో పడి భారత స్త్రీ తన వున్నత స్థానాన్ని కోల్పోతుందంటాను.

★ అసలు స్థానం వుంటేకద — కోల్పోడానికి — ఫరవాలేదు — వెర్రో మొర్రో మా గోల మమ్మల్ని పడనివ్వండి.

కె. వి. ఆర్. ఎమ్. బిల్లుమడ

మీరేదో పెద్ద తెలివితేటలుకల దాన్ననుకొని సమాధానాలిస్తున్నారు. కాని మీ తెలివితేటలు నాకేం కన్పించడంలేదు మేడమ్.

★ ఎలా కన్పిస్తాయి సార్, కళ్ళతో చదివేసే వాళ్ళకి కన్పించవు. కాస్త చూపుకి బుర్ర కూడా జత చేయాలి మరి.

అనురాగం

చావకుండా తప్పించుకున్నాను. ఆ ఊళ్ళోనుండి పారిపోదా మనుకున్నాను. కాని ఆమెను వదిలి వెళ్ళటానికి మనసొప్పలేదు. అంత రభస జరిగినా ఆమె మీద నాకు గల ప్రేమ అవగింజంతయినా తగ్గలేదు. ఆమెను తీసుకుని మరో ఊరు వెళ్ళిపోదామనుకున్నాను. ఆ మాటే ఆ రాత్రి ఆమెను రహస్యంగా కలుసుకుని చెప్పేను. "నీ భర్తకి విడాకులివ్వు. నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అనికూడా చెప్పేను. కాని ఆమె అంగీకరించలేదు. "అమ్మో! విడాకులే?" అంది. భర్తని వదిలిన భారత స్త్రీకి సంఘంలో గౌరవం లేదంది. ఎన్ని అవకతవకలున్నా ఒకసారి ఏడడుగులు కలిసి నడచిన దంపతులు చచ్చేవరకు ఒకేచోట పడుండాలన్నది. ఆమె చెప్పే పాతివ్రత్య ధర్మాలను వింటుంటే నాకు మతి పోయింది. "నీ భర్త కళ్ళుగప్పి నాతో యిన్ని నెలలుగా కాపురం చేసినప్పుడు యీ పాతివ్రత్యం ఎక్కడకు పోయింది?" అనడిగేను కోపంగా.

"అది వేరు. ఇది వేరు. మాంసం తింటున్నాం కదా అని బొమికలు మెళ్ళోకట్టుకుని తిరుగుతామా? ఒక మగవాడిమీద మనసుపడి అతనితో ఆనందించినంత మాత్రాన- మొగుణ్ణే వదిలిపెట్టాలమందా? తెలిసో తెలియకో తప్పుపని చేసిన ఆడదాన్ని ఎన్ని మాటలన్నా ఆ తరువాత అంతా ఆమె చేసిన తప్పును మర్చిపోతారు. భర్తతో సవ్యంగా కాపరంచేసే ఆడది ఎన్నివేషాలు వేసినా క్షమించగల శక్తి మన సమాజానికి ఉంది. కాని మొగుణ్ణే వదిలిపెట్టిన ఆడది ఎంత శీలవతియైనా ఆమెకు సమాజంలో గౌరవ స్థానం వుండదు. నన్ను క్షమించు. నీతో పొందే ఆనందంకోసం అంతటి త్యాగాన్ని నేను చెయ్యలేను." అన్నది.

పతివ్రతల కథలు నేటి భారత స్త్రీలపై ఎలాటి ప్రభావాన్ని కలిగివున్నాయో అప్పుడు నాకర్థమయింది. అలాటి పతివ్రతయైన స్త్రీని నేను ఎలా ప్రేమించగలిగేనా అని నన్ను నేనేఅసహ్యించుకున్నాను.

పైగా ఆమె "అట్టే నాగురించి మనసు పాడుచేసుకోక చక్కగా పెళ్ళి చేసికో." అన్నది. పెళ్ళి! మనవాళ్ళ యింకా వివాహానికి ఎందుకంత అధిక ప్రాముఖ్యత నిస్తారో నాకిప్పటికీ అర్థంకాదు. వివాహ వ్యవస్థ ఏ పవిత్రమైన ఆశయంకోసం ఏర్పడిందో ఆ పవిత్రతని నిలబెట్టే నైతికబలం లేకపోయినా ఆ వ్యవస్థమీద నమ్మకం మాత్రం చాలామందికి పోలేదు. తమ భావాలతో, ఆచరణతో వివాహ బంధాన్ని ఎంత మలినపరచినా ఆ వివాహమనే పదాన్ని మాత్రం వాళ్ళు గౌరవించక మానరు. దీనికి కారణం ఒక్కటేననిపిస్తుంది. వివాహాన్ని మనం ఒక సామాజిక బాధ్యతగా స్వీకరిస్తున్నామే గాని వ్యక్తి సుఖంకోసం, అతనియొక్క నైతిక పురోగమనంకోసం యీ వ్యవస్థని ఏర్పరచుకున్నామన్న సత్యాన్ని చాలామంది విస్మరిస్తున్నారు. అందుకే ఆ వ్యవస్థ లోపల వుండి ఎన్ని పాపాలైనా చెయ్యటానికి వెనుదీయని మనుషులు దానిని దాటి బయటకు రావాలంటే భయపడుతున్నారు.


అందునా నేను ప్రేమించి, మోహించి, కామించి,అనుభవించినస్త్రీ అంతటిఅల్పురాలనితెలియటంతో నామీద నాకు చెప్పలేని అసహ్యంవేసింది. నేను ఎరిగిన మొదటి స్త్రీ, ఆఖరి స్త్రీకూడా ఆమే!

ఆమె నిజస్వరూపం తెలిసిన తరువాత అంతకు ముందు ఆమెతో గడిపిన మధుర క్షణాలన్నీ ఎంతో వెగటుగా, చౌకబారుగా తోచినయ్.

పాతివ్రత్యపు ముసుగులోపల స్త్రీలు చేసే పాపాలను కళ్ళారా చూసిన నాకు స్త్రీ జాతంటేనే— అసలు సెక్సు అంటేనే అసహ్యం వేసింది.

ఆ మర్నాడు తెల్లవారుఝామున బండికే ఊరు వదిలి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను. కాని తీరా బయలుదేరేముందు ఆమె నూతిలోపడి చచ్చిపోయిందన్న వార్త వూరంతా గుప్పుమంటూ వ్యాపించిపోయింది. ఆమె తెల్లవారుఝామున స్నానానికని లేచి చీకట్లో కాలుజారి నూతిలో పడ్డదని అందరూ అనుకున్నారు. కాని నాకుమాత్రం అలా జరిగివుండదన్న అనుమానం కలిగింది. ఆమె భర్త ఆర్తి ఆమెను నానా హింసలు పెట్టి, చంపి నూతిలో పడేసి వుంటాడని నాకు గట్టి నమ్మకం ఏర్పడింది. ఔను. అలా చెయ్యగల క్రౌర్యం, మూర్ఖత్వం, అహంభావం, అధికారం, డబ్బు, సంఘంలో పరపతి అన్నీ అతని కున్నయ్.

ఆమెమీద ఎంత కోపంగావున్నా ఆమె చచ్చి పోయిందని విన్నతరువాత నా గుండె ద్రవించి పోయింది. ఒక్క సంవత్సరంలోపల ఎన్ని అనుభవాలు! ఎన్ని అనుభూతులు! ఆమెను ఆరాధించేను. ప్రేమించేను. అనుభవించేను. అసహ్యించుకున్నాను. చివరికి ఆమె చావుకూడా కళ్ళారా చూసేను. ఒకే స్త్రీ నాలో యిన్ని భావాలను రేపటం—అందునా అంతటి స్వల్ప వ్యవధిలో ఇవన్నీ జరగటం ... నా మెదడుమీద, హృదయంమీద ఎంతో ప్రభావం కలిగించింది. చిన్నతనంలోనే అమ్మా నాన్నను పోగొట్టుకుని మేనమామ ప్రాపకంలో, అత్తయ్య ప్రేమరాహిత్యంలో పెరిగి పెద్దవాడినైన నేను జీవితంలో ఒకే ఒకసారి ప్రేమించేను. ప్రేమించిన మనిషినే విపరీతంగా ద్వేషించేను. ఆమెను శాశ్వతంగా దూరం చేసుకున్నాను. ఇంక జీవితంలో యింతకుమించిన అనుభవాలేమీ అక్కర్లేదనిపించింది. ఒక స్నేహితుడి ద్వారా ఈ సినిమా రంగంలో ప్రవేశించేను. కేవలం ఒక వ్యాపకాన్ని కలిగించుకునేందుకు వ్రాయటం మొదలెట్టేను. కాని నా వ్రాతలలో నాకే తెలియని ఎన్నో శక్తులు బహిర్గతం కాసాగినయ్. అందరూ నన్ను మెచ్చుకున్నారు. ఆకాశాని కెత్తేసారు. కాని అవేమీ నాకు తృప్తినివ్వలేదు. అందుకే తాగుడు అలవాటు చేసుకున్నాను. దానికి డబ్బుకావాలి కనుక యింకా వ్రాయటం మొదలుపెట్టేను. చివరికి ఈ స్థితికి వచ్చేను"అంటూ ముగించేడు అశ్వని. (ఇంకా వుంది)


తప్పక చూడండి!
ఇన్నాళ్లుగా మీ ముందు ఎప్పుడూ నోరెత్తలేదు! నా తండ్రి కొండలాంటి గుండెలో వెన్నుదాచుకున్న దేవుడని భ్రమ పడ్డాను ! కాని కట్టుకున్న ఇల్లాల్ని అవలీలగా మర్చిపోగల కర్కోటకుడు అని తెలిసిన తర్వాత కూడా నోరు ఎత్తకుండా ఎలా వుండమంటారు ?
తండ్రిని మించిన తనయుడుగా
కృష్ణ ద్విపాత్రాభినయంతో!
శ్రీమూర్తి ప్రొడక్షన్సు వారి
అభిమానవతి
నిర్మాతలు: జి. సాంబశివరావు

సమతా సమాజానికి సరైనదారి భూ సంస్కరణలు

శ్రీ పిడతల రంగారెడ్డి

[ఆర్థిక, సమాచార శాఖల మంత్రి]

సంఘమైనా, సాంఘిక జీవనమైనా, మతమైనా మూఢాచారాలైనా, వ్యవస్థ అయినా వ్యక్తి అయినా సక్రమంగా లేనప్పుడు సంస్కరించడం అవసరం.

ఈనాడు భూకమతాల హక్కు భుక్తుల్లో ఎన్నోలోపాలు వున్నాయి. ఈ లోపాలుఎప్పటి నుంచో పాతుకొని పోయివున్నాయి. దీనిని సంస్కరించకపోతే దీని ప్రభావం సమాజంమీద విపరీతంగా ఉంటుంది. ఈ ఎగుడుదిగుడుల వ్యత్యాసం అన్ని రంగాల్లోకి విస్తరిస్తుంది. సోషలిస్టు తరహా సమాజం ఏర్పడకుండా అడుగడుక్కీ అడ్డుకట్టలు వేస్తుంది. చిరకాలంగా వస్తోన్న యీ లోపానికి చికిత్స జరగాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఆవిర్భవిస్తుంది.

లేనివాడికి సెంటు భూమున్నాలేదు. ఉన్నవాడికి అవసరాన్నిమించిన భూమిఉంది. చాలామంది రైతులు స్వంతానికి ఏమీలేకుండా నే–వున్నా తగినంత లేకుండానే వ్యవసాయమే ముఖ్య జీవనాధారంగా బ్రతుకుతున్నారు. సంపద ఏకొద్దిమంది చేతుల్లోనో కేంద్రీకరింపబడివున్నట్లే భూమికూడా ఏకొద్దిమంది భూస్వాముల హక్కు భుక్తులక్రిందనో వుండిపోయింది. కాలుక్రిందపెట్టకుండా కూచున్నవాడికి పంచభక్ష్య పరమాన్నాలు, కష్టపడి పంట పండించే వాడికి అర్ధాకలి వస్త్రులూ—ఇదీ పరిస్థితి.

జమీందారీలూ రద్దయినా ఆ అవశేషాలు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అవశేషాలను తొలగించడానికే యిప్పుడీ భూ సంస్కరణలు ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెసు మహాసభల్లో భూసంస్కరణలకు సంబంధించి అనేక సార్లు తీర్మానాలు చేశారు. తదనుగుణంగా 1969 లో కేంద్ర భూసంస్కరణల మండలిని ఒకదానిని రూపొందించి, ముసాయిదా భూసంస్కరణల బిల్లును తయారుచేసి కేంద్రం అన్నిరాష్ట్రాలకూ పంపించింది. ఆయా రాష్ట్రాలు భూసంస్కరణ చట్టాలను ప్రవేశపెట్టాయి. మనరాష్ట్రంలో కూడా రాష్ట్ర శాసనసభ భూ సంస్కరణల (వ్యవసాయ కమతాలపై పరిమితి) చట్టాన్ని 1973లో చేసింది. ఇది 1975 జనవరి 1 వ తేదీనుంచి అమలులోకి వచ్చింది.

సామాజిక న్యాయానికి యీ భూసంస్కరణలకు అవినాభావ సంబంధంఉంది. ప్రస్తుత సమాజంలో వున్న హెచ్చు తగ్గుల్ని తొలగించడానికి ఇదొక ఆయుధం. ఈ ప్రజల్లో వున్న అంతరాల్ని తొలగించే ఏ చర్య అయినా జాతీయ ప్రయోజనకరమైన చర్యే. అటువంటిదానికి అత్యధిక ప్రాధాన్యం వుండి తీరుతుంది.

గ్రామాల్లో కొన్ని కుటుంబాలు మాత్రమే ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా పెత్తనం చలాయించడానికి కారణం ఒకవిధంగా భూ సంపదే అనవచ్చు. భూస్వాములే సర్వసాధారణంగా గ్రామాల్లో పలుకుబడి కలవారుగా వుంటున్నారు. భూసంపద, వారిని ఆర్థికంగా ఉన్నతులనుచేసి, తద్వారా రాజకీయ, సాంఘిక జీవితాల్లో పెత్తనం చెలాయించేట్టు చేస్తోంది. అందువల్ల మొత్తం గ్రామీణ జీవితవ్యవస్థను వీరు శాసించగలుగుతున్నారు.

పైగా ప్రభుత్వం అందజేసే అనేకరకాల సౌకర్యాలను యీ కొద్దిమందిభూస్వాములే అందుకుని ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తోన్న కృషి ఫలితాలను సామాన్యుడికి అందనీయకుండా అడ్డుకుంటున్నారు. ఋణ సౌకర్యాలనుగాని, ఎరువులు, మేలురకం విత్తనాల పంపిణీ మొదలైన సౌకర్యాలనుగాని, మార్కెటు సౌకర్యాలనుగాని ముందుగా వీరే అందుకుంటున్నారు. స్వయంగా తమకు శక్తి వున్నప్పటికీ ప్రభుత్వ సహాయాన్ని ఇతరులకు దక్కకుండా తస్కరిస్తున్నారు. దీని ఫలితంగా బీదరైతులకు ఉద్దేశించిన సహాయం వారికి చేరడం లేదు. బీదరైతు బీదవాడుగానే వుండిపోతున్నాడు. భూస్వామి మరింతగా లాభాలుచేసుకుంటున్నాడు.

ప్రభుత్వం స్వాధీనపరచుకున్న అదనపు భూములను, ఇళ్ళూ వాకిలిలేని పేదలకు, వ్యవసాయ కూలీలకు, వ్యవసాయంమీద ఆధారపడి జీవించే ఇతర వర్గాలవారికీ, ఇళ్ళ స్థలాల రూపంలో కూడా పంచడం జరుగుతుంది. బలహీనవర్గాలవారికి, వెనుకబడిన కులాల వారికే యీ సంస్కరణలు ఎంతో మేలు చేస్తాయి.

ఏ భారత దేశంలోనైతే పేదరికం, అస్పృశ్యత, కులమతాల భేదాలు మచ్చుకైనా కనిపించవో అటువంటి స్వతంత్ర భారతంకోసం నేను పోరాడుతున్నానని చెప్పిన మహాత్ముని కలలు నిజమయ్యే సమయం సమీపించింది. మన ప్రియతమ ప్రధాని సారథ్యంలో అంచెలంచెలుగా మనం ప్రగతి సాధిస్తున్నాము. రాజరికాలు, జమీందారీలు, రద్దయిపోయిన విధంగానే, భూస్వామ్య విధానం కూడా అదృశ్యమైపోతుంది. ఈ ప్రభుత్వం ప్రజలది. ప్రజల ప్రభుత్వం ప్రజలకోసమే కృషి చేస్తున్నది. ప్రజల పక్షమే వహిస్తుందికాని, స్వార్థపరుల పక్షంకాదు. భూసంస్కరణలు సత్వరం అమలుపరచడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నది. అదనపు సిబ్బందిని నియమించడం కూడా జరిగింది. బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమం సిద్ధించి, దేశంయావత్తూ నవజీవంతో, అభ్యుదయ చైతన్యంతో తొణికిసలాడే రోజు ఇంకా యెంతో దూరం లేదు. ●


"పువ్వును దేవుని పాదాల దగ్గరుంటే తీసి కళ్ళకద్దుకుంటారు. వెలయాలి సిగలో వుంటే వాసన చూసి వదిలేస్తారు." భారత స్త్రీ జీవితాన్ని సమగ్రంగా చిత్రించిన మనోహర దృశ్యకావ్యం.


మనోరంజని పిక్చర్స్

భారతి

తప్పక చూడండి!

కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం,
వేటూరి
నిర్మాత: కె. వి. రెడ్డి





సంగీతం: కోదండపాణి
కెమెరా: దేవరాజ్

ఆంధ్ర: శ్రీ వెంకట విజయా కంబైన్స్,
నైజాం: విజయలక్ష్మీ సురేష్ కంబైన్స్,

హైదరాబాద్ నోట్ బుక్

(5 వ పేజీ తరువాయి)

ఉదయం ముహూర్తానికీ, సాయంకాలం విందుకు మంత్రులు, చలనచిత్రనటులు, విద్వాంసులు, కవులు, పురప్రముఖులు వేలసంఖ్యలో విచ్చేసి శుభాశీస్సులిచ్చారు. సాయంకాలం శ్రీ నేరెళ్ల వేణుమాధవ్ తమ మిమిక్రీ ప్రదర్శనంతో, శ్రీ బెనర్జీ బృందం రుద్రమదేవి బుర్రకథతో, నేపథ్య గాయకుడు శ్రీ ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం తమ గాన మాధుర్యంతో ఆహూతులను ఆనందపరచారు.

కళావాణి

యువ సాహిత్య, సాంస్కృతిక సమాఖ్య అయిన 'కళావాణి' ఫిబ్రవరి 23 న సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూలులో ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీమతి చావలిమణిశాస్త్రిగారు "సమాజంలో స్త్రీల పాత్ర" అనే విషయమై ప్రసంగించారు. దేశంబాగుపడడానికి సమాజం బాగుపడాలని, సమాజం బాగుపడడానికిక్రమశిక్షణ అవసరమని, క్రమశిక్షణలేని సమాజం వ్యవస్థలేని ఇంటివంటిదని అన్నారు ఆమె. 'కళావాణి' 1970 ఏప్రిల్ 28 న 30 మంది సభ్యులతో ప్రారంభించబడింది. వీరిలో ఐదుగురు స్త్రీలు ఈ సంస్థ ప్రతినెలా (1) ప్రముఖుల సందేశం, (2) అతి సమక్షంలో అనే రెండు సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తుంది. స్వాతంత్ర్య రజతోత్సవం సందర్భంగా 1972 లో "ప్రతిబింబాలు" అనే కవితా సంపుటి ప్రచురించింది. పెక్కునాటికలు ప్రదర్శించింది, సంగీతకార్యక్రమాలు నిర్వహించింది. ఏటా యువతీ యువకులకై వ్యాస రచన, వచన కవిత, కథలు, ఉపన్యాసం పోటీలు జరిపి బహుమతులిస్తుంది. ఔత్సాహిక యువతీయువకులు దీనిలో చేరవచ్చునని సంస్థాధ్యక్ష కార్యదర్శులు కోరుతున్నారు.

ఉపశ్రుతి:

"ఏంసార్, రాజకీయాలలో దిగారు, దూషణ తిరస్కారాలకు సిద్ధంగా వుండాలి, ఆలోచించారా?" అన్నాను కొత్తగా రాజకీయాలలో దిగిన ఒక లాయరు మిత్రునితో. "స్వామీ తిట్లకు భయపడే కరణం, ముట్లకు భయపడే మడివేలు ఉంటారా? అనే సామెత విన లేదూ" అని సమాధానమిచ్చాడు ఆయన.

— తిరుమల రామచంద్ర.

ఫాలాక్షుని డైరీ

(12వ పేజీ తరువాయి)

పాప కోసం ... ...

బొంబాయి చూడ్డానికి అహమ్మదాబాద్ నుంచి 27 ఏళ్ల కళామనవగేలా అనే ఆయన, ఆయన భార్య 23 ఏళ్ల సవిత తమ ఏడాది పసిపాపతో వెళ్ళి, 12వ తేదీన "గేట్‌వే ఆఫ్ ఇండియా" పిట్టగోడ మీద కూర్చుని పుల్లాసంగా కబుర్లు చెప్పుకుంటుండగా పసిపిల్ల జారి సముద్రంలో పడిపోయిందట. పాపను రక్షించడానికి వారిద్దరూ కూడా సముద్రంలో దూకేసరికి వగేలా ఒక్కడే ప్రాణాలతో బయట పడ్డాడట—పాపం !

పెళ్లి సరదా !

వెస్ట్ జర్మనీలో ఇరవైయ్యేళ్ళలోపు వయసున్న ఆడ, మగ పిల్లలను తరచిచూస్తే, వారికి వివాహేచ్ఛ చాలా అధికంగా పున్నట్టు తేలిందట. వీలైనంత గబుక్కున పెళ్ళి చేసుకుని, జీవితంలో స్థిరపడి పోవాలని ఆ వయసువారు ఆరాటపడుతున్నారట. అక్కడి ప్రభుత్వం మొన్న జనవరి ఒకటినుంచి వివాహాల చట్టాన్ని మార్చిందట. తత్ఫలితంగా ఇరవైయ్యేళ్ళ వయసులో పున్న పిల్లలయినాసరే తమతల్లిదండ్రుల సమ్మతిలేకపోయినా హాయిగా పెళ్లిచేసుకో వచ్చుట. ప్రభుత్వం మరి కొన్ని సూత్రాలను కూడా సవరణచేసిందట. స్కూల్లో చదువుకునే పిల్లలు స్కూలుకు రాకపోయిన రోజున కారణం వివరిస్తూ తమ తలిదండ్రుల నుంచి సంతకాలుచేసిన పత్రాలు పట్టావలసిన పనిలేదని, ఆ విద్యార్థులే కారణం రాసి, సంతకంచేస్తే చాలునని కూడా సవరణ చేసిందటా ప్రభుత్వం. అంతేగాక పిల్లలు తమ తలిదండ్రులతో సరిపడకపోతే వేరే పుండవచ్చునని, అలా వేరే పుండి, తమకయ్యే ఖర్చులు తలిదండ్రులకు బిల్లువేసి పంపితే, వారే భరించాలనీ కూడా సవరించిందట. పిల్లలయినాసరే ఏ నేరంచేసినా ఆ నేరానికి పెద్దవారితో సమానమైన శిక్షే పడుతుందట. శిక్షలో తగ్గింపు పుండదట. తలిదండ్రులకు తెలియకుండా పిల్లలు చేసిన అప్పులప్పులకు ఆ పిల్లలే బాధ్యులుగాని, తల్లిదండ్రులుకారట ! !

మందు రహస్యం

"ఫమీర అత్రషాని" అనే వో రకం మందు (యునాని మెడిసన్)లో వో చిన్న లోహపు ముక్క పున్నట్టు ప్రెసిడెంటు అహమ్మదే అన్నారట. ఆ మందులో వెల్లని, బాగా చిన్నవైన వెండిరజను వంటి వుంటాయని, యీ ముక్క వెండికాదని కూడా యీ విషయం వెల్లడిచేసిన డిప్యూటీ హెల్త్ మంత్రి మిస్టర్ ఇజాక్ లోక్‌సభలో అన్నారట.

చేసిచూస్తే సరి !

ఎండాకాలంలో తమ తమ గదుల్లో నేలమీద ఖాళీ గోనె సంచులువేసి, వాటిని రోజుకు మూడు సార్లు తడుపుతూవుంటే వడగాడుపుగదిలోకిరాదని, యీ రకంగా ఎండ వేడినుంచి తప్పించుకోవచ్చని రూర్కీలోసెంట్రల్ బిల్డింగ్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారు కనిపెట్టారట.

ప్రపంచము యొక్క ప్రప్రథమ డెటర్జెంట్ ఉతికే బార్

సూపర్ 777



హెచ్చు తెల్లదనము, తక్కువ ఖర్చులో



సూపర్ 777 ఉతుకు ప్రపంచములో సరిక్రొత్తది! ఇది క్రొత్త ఫార్ములా. దీనికి ఎక్కువ బట్టలను ఎక్కువ తెల్లగా, ఎక్కువ శుభ్రముగా ఉతికే సామర్థ్యము ఉన్నది—ఉప్పు నీళ్లలో కూడ! దీని ధర మామూలు బార్ సబ్బుల కంటె తక్కువ కూడ!

(ఒక క్రొత్త రకపు ఉతికే బార్‌ను వాడడము ప్రారంభించండి—సూపర్ 777 డెటర్జెంట్ ఉతికే బార్!)

shilpi hpma 6A/73 TEL

పిలుపులు

కుమారి కె. హనుమాయమ్మ



సాయంత్రం పూట మల్లెపందిరి ప్రక్కన శరత్ 'దేవదాసు' చదువుతున్న నేను, యెవరో వచ్చినట్లు అలికిడైతే వులికిపడి గేటు వైపు చూసాను. ఆ వచ్చింది నా స్నేహితురాలు జయ. "అబ్బ! ఎన్నాళ్లయిందే నిన్ను చూసి, రారా! చాలా మారిపోయావుసుమా! అమ్మ, తమ్ముడు, చెల్లాయి, ప్లస్ నీ వుద్యోగం. అంతా క్షేమమేనా? అన్నట్లు నీకు పెళ్లి నిశ్చయమైనదిట కదూ!" అని యింకా ఏదో అడగబోతూ, విసుగుతో కూడిన నవ్వుతో నా వైపు అలాగే చూస్తూ నిలబడి పోయిన జయను చూసి, అతిగా వాగేస్తున్నానన్నవిషయం గుర్తుకురాగా చిన్నగా నవ్వేశాను.

జయ మాత్రం నా వైపు యిలా సూటిగా చూసి, "నీకు బుద్ధిలేదు" అని స్టేట్‌మెంట్ నా ముఖానపడేసి, నాకు లేని తనకు వున్న బుద్ధేమిటో కనుక్కుందామనుకునే లోపతే ఇంట్లోకి మాయమైంది. జయ అలా లోపలికి వెళ్లిందంటే కొంపమునిగిందన్నమాటే! బామ్మని కాకాపట్టి ఏ జంతికలో, అరిసెలో టిఫిన్ కొట్టి, అమ్మతో కాస్సేపు బాతాఖానీ కొట్టి, మంచి టీ తాగి, తిరిగ్గా అరగంట తర్వాత గానీ నాముఖం చూడదు. ఇలాపరిస్థితి విషమించకుండా వుండాలంటే, చెవిపట్టుకుని దాన్ని బయటకు లాక్కొచ్చేయటం వొక్కటే సుదూరంలో కనిపించే మార్గాంతరం. ఇది తక్షణం అమలు పెట్టాలని లోపలికి అడుగు పెట్టానో లేదో రివ్వున జయ దూసుకువచ్చి, ఒక చేత్తో టిఫిన్ ప్లేటు, మరో చేత్తో నా చేయి పట్టుకుని జరజరా మేడమీదకు లాక్కుపోయి 'తపీ'మని క్రిందకూలేసి, బలవంతంగా నా నోట్లో ఓచిన్న లడ్డూ ముక్క పెట్టి, సీరియస్‌గా నా వంకచూస్తూ: "అమ్మడూ! నేనో బుల్లికథ చెపుతాను, అడ్డు ప్రశ్నలేయకుండా విను!" అని నా అంగీకారంతో పని లేకుండా చెప్పుకుపోసాగింది.

"అనగనగా ఓ అబ్బాయి! కొమ్మేరులాంటి ముక్కు కొనమీద సీమ పచ్చిమిరపకాయంత కోపంమాత్రం వున్న చిన్నవాడు, ఆధునిక యుగంలోని ఆదర్శభావాలే ఆస్తిపాస్తులుగా, నాలుగువందల రూప్యముల వుద్యోగమే పురుష లక్షణముగా, యువతీ జనసంరక్షణమే అణువణువునా రంగరించుకున్న చక్కని అందగాడు. శ్రీధర నామధేయుండు ఒకడు గలడు...!"

"ఎచట?"

"ఇచట మాత్రము కాదు. రాజమండ్రి

యందు".

"ఉన్న మనకేమి ?"

"అతగాడిని నీ చెలికత్తెన్మైన ఈ జయ లక్ష్మికి జతగానిగా మన పెద్దలు... సారీ!... మా పెద్దలు నిశ్చయించినారు, గాన బంధు మిత్ర సమేతంగా, నువు మాత్రం వారం రోజులు ముందుగా విచ్చేయవలెను. రాకున్న కఠిన శిక్షవిధింపబడును. చెవిమెలిపెట్టి, బుగ్గ గిల్లి, యింకా..."

"స్టాప్! నీకు పెళ్లి—నాకు శిక్షా! ఇదెక్కడి మిత్ర ద్రోహమోయ్! అయినా నేను రాకుండా నీ మెడలో తాళికట్టటానికి ఆ శ్రీధర్ గార్కి ఎన్నిగుండెలు ?"

"కేవలం రెండు. అంతే !"

"అదేమిటి? నీగుండెగానీ ముందే ట్రాన్స్ ఫర్ చేశావా ?"

"కరెక్ట్! నిజం చెప్పొద్దూ! పెళ్లిచూపులకు వచ్చినపుడు యువతులు—పెళ్లిళ్ల సమస్యలు. కట్నాలు, ఆడపిల్లల తల్లి దండ్రుల అగచాట్లు వగైరాలను గురించి పెద్దస్పీచ్ దంచేసి, పైసా కట్నం తీసుకోకుండా, నిరాడంబరంగా పెళ్లి చేసుకుంటానని ఆ పెద్ద మనిషి అనేసరికి, నన్నునేను మరిచి పోయి, 'కట్నం యివ్వలేకపోయినా పిడికిలంత నా గుండెను కానుకగా యిస్తాను లే!' అని కళ్లతో చెప్పాను. ఆ తర్వాత, అది నాదగ్గర కనిపించక ఖంగారుపడుతుంటే, "నీ హృదయం నా దగ్గరకు పదిలంగా చేరింది" అని అతని దగ్గర నుంచీ లెటరు వచ్చింది. అదీ సంగతి !"

శ్రీధర్ ... రాజమండ్రి ... ఆదర్శం ... కట్నం తీసుకోక పోవటం...ఏదో సంఘటన నాకు లీలగా గుర్తుకు రాసాగింది.

"ఏయ్ నాటీ! పలకవేం !"

దోసిలిలోకి జయ ముఖం తీసుకుని "నా జయులూ! నువు నిజంగా అదృష్టవంతురాలివే!" ఎందుకో నా స్వరంలో నాకు తెలియకుండానే ఏదో మార్దవం తొణికింది.

"అందరూ అలాగే అంటున్నారు. కానీ ...నాకే ఒక్కోసారి యిది కలేమో, చేయి జారిపోతోందేమో అనిపిస్తోంది. ఈ అదృష్టం చాటున ఏవైన విషాదపు నీడలు దాగున్నాయేమోనని తడబాటు కలుగుతోంది. చాటుగా అమ్మలక్కలు 'అందగాడు, ఉద్యోగం చేస్తూ గూడా కానీ కట్నం తీసుకోవటం లేదంటే అతనిలో ఏదైనా లోపం వున్నదేమో' అనుకుంటున్నారట! అమ్మ చెప్పింది. నేను మాత్రం లెగించాను. నాన్న లేని నాకు, మా తాహతులో యింతమంచి సంబంధం ఎలా వస్తుంది ? అతనిలో ఏదన్నా లోపమ్ంటే అది నా దురదృష్టం అనుకుంటాను. అంతే కానీ, ఒక సహృదయుడు, మంచి మనసుతో, నా లాంటి పేద పిల్లను పెళ్ళాడతానంటే, పిచ్చిపిచ్చి ఆలోచనలతో కాదనటం నాకు చేత కాలేదు ! నువు చెప్పు! నా నిర్ణయంలో పొరపాటేమైనా వుందంటావా ?"

"జయా ! నీ జీవిత సమస్యను గురించి యింతచక్కగా ఆలోచించి చేసిన నిర్ణయంలో పొరపాటు ఎందుకుంటుంది? జీవితంలో ఒకే ఒక్కసారి యెదురయ్యే అదృష్టాన్ని యింత చక్కగా వుపయోగించుకోగల్గిన నిన్ను తప్పక కంగ్రాచ్యులేట్ చెయ్యాలి! వేరే ఆలోచనలతో నీ మనస్సు పాడు చేసుకోకు. విష్ యు ఆల్ ది బెస్ట్! మరి, నీ వుద్యోగం ఎలా?రాజీనామా యిస్తున్నావా?"

"ఉహూఁ! తమ్ముడు, చెల్లెలు యింకా చిన్నవాళ్ళు, అమ్మకూడా ఒంటరిదే! వాళ్లను ఎలా వదిలేయను చెప్పు? నేను వుద్యోగం చేయటం వారికి యిష్టమే! నేను రాజమండ్రికి ట్రాన్స్ఫర్ చేయించుకోవటానికి ప్రయత్నిస్తున్నాను, బహుశ రెండు నెలల్లో వీలు కావచ్చు! ఈ లోపల ఆషాఢ మాసం గ్దటా వున్నాయిగా ! ఆ తర్వాత అమ్మావాళ్లని నాతో తీసికెళ్లి పోతాను" అన్నది జయ నవ్వుతూ. అంతలోనే టైమ్ చూసుకొని, "మై డియర్ రోగ్! నేనిలా కబుర్లు చెపుతుంటే నా మీద మత్తుమందు గానీ జల్లుతావా, టైమ్ తెలియకుండా! ఈపాటికి అమ్మ ఆరడుగుల ఎత్తున ఎగురుతూ పేరిణీ నృత్యం చేస్తుంటుంది - నేనింకా రాలేదని. మళ్లీ మళ్లీ బతిమాలించుకోక మంచిపిల్లలా వారం రోజులు ముందు వచ్చేయ్! షాపింగ్ అంతా మనదే!రాకపోతే నీ జత పచ్చి!"అంటూ వెడ్డింగ్ కార్డు నా ముందుంచి వెళ్ళబోతూ, 'అరె' అని చటుక్కున ముందుకువంగి నాబుగ్గ మీద ముద్దు పెట్టుకుని, ఎంత హడావుడిగా వచ్చిందో, అంత త్వరగా వెళ్లిపోయింది జయ.

అనాలోచితంగా వెడ్డింగ్కార్డు చూస్తున్న దృక్కులు 'శ్రీధర్' అన్నచోట ఆగిపోయాయి. నా ప్రమేయం లేకుండానే మూడు నెలల క్రిందట మా యింట్లో జరిగిన సంఘటన నాకళ్ళముందు కదిలింది...

"ఒరే రావుడూ! నువ్వు లక్ష చెప్పు ! కోటి చెప్పు! నాకీ సంబంధం ససేమిరా నచ్చ లేదు ! అబ్బాయి బియ్యే చదివాడుట ! లక్షణంగా వుద్యోగం చేసుకుంటున్నాడట! కట్నంమాత్రం అక్కర లేదుట! పిచ్చివాడివి నువ్వు పులలాట పడుతున్నావుగానీ, ధనం ఎవరికైనా చేదా ! ఆ అబ్బాయిలోనో, ఆవంశంలోనో ఏదో లొసుగు వుంది. అది కప్పిపుచ్చటానికి ఆదర్శమని పెట్టి, పసివూసిన మారేడు కాయను మనకంటగడదామని వాళ్ళ ఎత్తురా అబ్బీ !"

"అయ్యో! అదికాదే అమ్మా ! ఈనాటి కుర్రవాళ్లకు అదో మోజు. అదో వుత్సాహం! అంతేగానీ, నిక్షేపంలాంటి అబ్బాయికి లోపం అంటగడితే ఎలా ?"


"అహా ! అలాగేం ! నేను పెద్దదాన్ని, నాకు తోచిన మంచేదో నేను చెప్పాను. నీ కూతురి కిష్టమైందని దాని మాటకే విలువిచ్చి, ఈ సంబంధమే ఖాయం చేసేట్లయితే మేందేనికి ? మా పెద్దరికాలు దేనికి ? సాయంత్రమే కాశీకిపోతాను ! ఛస్తే మీ గడప తొక్కను !" అంటూ ధరాలున బామ్మ లోపలికి వెళ్లిపోయింది.

వెంటనే అమ్మ అందుకుని "చూడండి ! మనకు పెద్ద ఆస్తులేమి లేకపోయినా, అది చివరిపిల్ల మనకు అచ్చట, ముచ్చట తీర్చు కోను యింకా ఎవరున్నారు గనక. అనక మనం కలో, గంజో తాగినా పిల్ల మంచి కంపెకావాల్సిందేముంది? లక్షణంగా వున్నంతలో కట్నంయిచ్చి వైభవంగా పెళ్లి చేయక, నిరాడంబరంగా చెయ్యాల్సిన ఖర్మ మనకేం పట్టిందండి ? చిన్నపిల్ల ! అది చెప్పినట్లు విని అత్తగారి మనసు నొప్పించకండి !"

"నువ్వూ అలా అంటావేం రాజ్యం ? ఇరవై యేళ్లు నిండిన నీ కూతురు యింకా చిన్నపిల్లా! దాని భవిష్యత్తు గురించి అది ఆలోచించుకోలేదూ ?"

వి లు వ లు

"అయితే యిదే మీ చివరి నిశ్చయమన్న మాట ! ముగ్గు రాడపిల్లలకీ ఘ నం గా పెళ్లిళ్లు చేసి, దీన్ని బతుకిలా చేస్తారా ? పెద్ద వారౌతున్నకొద్దీ మీకు బొత్తిగా మతి పోతున్నది ! మీరిలాగే చేస్తానంటే నేనే నుయ్యో, గొయ్యో చూసుకోవటం ఖాయం!" అంటూ నిష్క్రమించింది అమ్మ.



"ఏదో పేదవాళ్ళింట్లో పెళ్ళిలాగా నిరాడంబరంగా జరిగితే చూస్తూ ఊరుకోగల్గిన ఓర్పు 'మీ బావకు కట్నం ఎంతరా' అని మా ఫ్రెండ్స్ అడిగితే 'మా బావ ఆదర్శ పురుషుడోయ్! అందుకని కట్నం తీసుకోలేను!' అని చెప్పుకోగలిగే వుదారత నాలో లేదు! నాకీ పెళ్ళి అసలిష్టంలేదు!" అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసి బయటకు వెళ్ళి పోయాడు అన్నయ్య.

నిస్సహాయంగా నా వంక చూసే నాన్నకు ఏ బదులూ యివ్వలేక వుబికి వచ్చే కన్నీటిని ఆపుకుంటూ నిశ్శబ్దంగా నా గదిలోకి వెళ్ళి పోయాను.

మూఢ నమ్మకాల బామ్మ...

మూర్ఖపు పట్టుదల గల్గిన అమ్మ...

స్పీచ్ భాషలో మాత్రమే ఆధునికత గల్గిన అన్నయ్య...

వీళ్ళని ఎదిరించి నేను పొందలేని వ్యక్తిని జయ పొందుతున్నదని తెలిసినప్పుడు. ఆవ్యక్తి విలువ మరెన్నో రెట్లు పెరిగినట్లనిపించింది నాకు నిశ్చయంగా ఇది అసూయ కాదు... ఆదర్శాన్ని అర్థం చేసుకోలేని పెద్దల నిర్ణయాన్ని ఎదిరించలేని నా అశక్తత...!

"అమ్మాయ్! ఇంకా మేడమీద ఏం చేస్తున్నావ్? చీకటిపడినా లైటు వేసుకోలేదూ? త్వరగా భోజనానికి రారాదూ, మీ అన్నయ్య, నాన్నగారూ వచ్చేసరికి పొద్దు పోవచ్చు..!" అమ్మ పిలుపుతో ఆలోచనలను అవతలకు నెట్టి వేస్తుంటే నా ఒళ్ళోంచి జారిపడ్డాయి జయ వెడ్డింగ్ కార్డు, శరత్ 'దేవదాసు'. ఎన్నిసార్లు చదివినా ఆ పుస్తకంలో చైతన్యవంతంగా అనిపించే ఒకే ఒక్క వాక్యం: "నీ పాదాల వద్ద నాకింత చోటియ్యి దేవదా!" అన్న పార్వతి మాటలు గుర్తుకు వచ్చాయి కానీ, ధైర్యంగా ఆచేయి అందుకోలేని దేవదాసు, తన జీవితం అంతా పరితపించినా తిరిగి ఆ అవకాశాన్ని పొందలేక పోయాడు. పతనమైనాడు జీవితంలో ఒక్కసారి మాత్రమే అదృష్టంగా వెతుక్కుంటూ వచ్చే అవకాశాన్ని చేజార విడుచుకుంటే అదే మరొకరిచేతచిక్కి, మరింత విలువను సంతరించుకొని, మనం పోగొట్టు కున్న దాని విలువ ఎంతో కొట్టొచ్చినట్లు వ్యక్తపరుస్తుంది. ఈ ఆలోచనే ముందుంటే ...' కళ్ళల్లో నిలిచిన నీటి తెరలు చూపుకు అడ్డంనిలిచి, నా చుట్టూ చీకటిని మరింత చిక్కంగా చేశాయి. ●

అంతర్మనస్సు

శ్యామల

[గత సంచిక తరువాయి]

తల పగిలిపోతున్నట్లున్నది అతనికి. "నేను కావాలని నీవంటే అనురాగం పెంచుకోలేదు నాకు తెలియకుండానే ఈ భావం పెరిగి నా హృదయమంతా నిండిపోయింది నీవు కోరి వచ్చే రత్నని పెళ్లిచేసుకొని-నీపట్ల ప్రేమని మర్చిపోయి-నన్ను నేనే మోసం చేసుకొని - మా యిద్దరికీ శాంతి లేకుండా చేయ మంటావా? నీవే చెప్పు!"

నిశ్శబ్దంగా దొర్లాయి కొన్ని నిమిషాలు.

"అన్నీ ఆలోచించి నీవేచెప్పు కుసుమా, ఏం చేయమంటావో అట్లాగే చేస్తాను." ఈసారి అతని స్వరంలో ఆవేశంలేదు నిరాశ నిస్పృహ, అంతకుమించిన బాధ ఉన్నాయి

ఒక్క నిమిషం ఆగి ఆమె చెప్పింది. ఆమె స్వరం నిశ్చలంగా, ఏ భావమూ వ్యక్తం చేయ కుండా ఉన్నది "ఒక్కోసారి సహజంగా మొలకెత్తిన భావానికి తలఒగ్గడమే మంచి దనిపిస్తుంది కాని ఆవిధంగా చేయటంవలన మరోవ్యక్తి మనసు ముక్కలైపోతుందనుకుంటే, అట్లా చేయరాదనీ అనిపిస్తుంది ప్రేమాభిమానాలు మనోధైర్యాన్ని ఇంతగా పరీక్షించగలవని ఇప్పుడే తెలుస్తున్నది! నేను నిన్నెపుడూ రత్న భర్తగానే ఊహించాను ఆనందించాను. కాని వంశీ, నీవు వచ్చిన ఈ నెల రోజుల్లో నాకు ఏమయిందో నాకే తెలియటంలేదు. ఎప్పుడో తెలియకుండా హృదయంలో ఒక బీజం పడింది. అది మొలకెత్తి ప్రూనై ఇంతటి తపన, ఇంతటి ఆరాటం కలిగిస్తున్నది. ప్లీజ్... వంశీ నాకు చేయూతని ఇవ్వు... మనిద్దరం ఈ ప్రేమని జయించాలి. మరొక వ్యక్తిని బాధించరాదు."

బరువుగా ఊపిరి తీసుకొని అన్నాడతను "నీవు అడిగినది ఏదీ కాదనలేను." అప్రయత్నంగానే ఆమె భుజాలపైనున్న అతని చేతులు ఆమె చెక్కిళ్లపైకి జరిగాయి. తన చేతుల్లో ఉన్న ఆమె ముఖాన్ని దగ్గరకు తీసుకొని ఆ లోతైన నల్లని కళ్లలోకి ప్రేమగా చూశాడు వాటిల్లో నీరు నిండివుంది. కన్నీటితోపాటు ఉన్న ఏదో కాంతి అతన్ని చూపులు మరల్చుకోనివ్వటంలేదు ఆమె బుగ్గల్లోనించి వెచ్చని ఆవిర్లు చిమ్ముతున్నాయి పరిసరాలని మరచి తదేకంగా

ఇంటింటి చిట్కాలు

* కర్పూరం ఆవిరి గాకుండా భద్రపరచాలంటే కర్పూరపు డబ్బాలో కాస్త బియ్యంగాని, నాలుగు మిరియాలు గాని వేసి యుంచండి
* ఫ్లాస్కులో కాఫీ వేడిగా ఉండాలంటే ఫ్లాస్కునిండా కాఫీ పోసి వుంచాలి
* వేడిపాలనే ఫ్లాస్కులో ఉంచుకోవాలి చల్లని పాలయితే విరిగిపోతాయి
* కాయగూరలలో విటమిన్లు నశించక ఉండాలంటే ముక్కలను పెద్దవిగా తరుగాలి!

— శ్రీమతి ఎస్. భువనేశ్వరమ్మ.

ఇంద్రధనస్సు

ఆమెని చూస్తుంటే ఇంతవరకు జరిగినదంతా కలవలె తోచింది. యుద్ధము, దుఃఖము, ప్రేమ, తిరస్కృతి — అంతా అసత్యమే. ఎదురుగా — జగతి అంతా నిండినట్లున్న ఈ ముద్దులమోము ఒకటే వాస్తవం. ఆమె వణుకుతున్న ఎర్రని పెదిమలపై మందు తున్న తన పెదిమలని ఉంచి గాఢంగా హత్తుకున్నాడు.

చెవికి శంఖాన్ని అనించుకుంటే వినవచ్చే సముద్రపు హోరు తనను ముంచెత్తుతున్నట్లనిపించింది ఆమెకి. ఆ హోరు నడుమనే తన గుండె అతి వేగంగా కొట్టుకుంటున్న శబ్దమూ వినిపించసాగింది. ఆమె శరీరం అతనిలో కరిగిపోతున్నట్లవగా వారికి కాలమే స్తంభించింది.

హఠాత్తుగా స్పృహ వచ్చినట యిందామెకి ఏమిటిదంతా? అయోమయంగా చూసిందతని వైపు, ఆ చూపు అతన్ని తట్టి లేపింది. చటుక్కున ఆమెని వదిలి దూరంగా జరిగాడు. ఒక్కక్షణం ఆగి అన్నాడు.

"క్షమించు! ఇంకెప్పుడూఇట్లా జరగదు!" వెనుదిరిగి చూడకుండా వడివడిగా నడుస్తూ వెళ్లిపోయాడతను.

నిలబడటానికి కూడాశక్తి లేనట్లనిపించిందామెకి. పెనుగాలిలో ఆకువలె శరీరమంతా కంపిస్తుండగా చెట్టు మొదట్లో కూలబడిపోయింది.

ఉదయమే వాహ్యాళికై తోటలోనికి వచ్చి, అప్రయత్నంగానే ఈ సంభాషణ అంతా ఆలకించి, కళ్లు తుడుచుకుంటూ వెళ్ళిపోయిన మూడోవ్యక్తిని వాళ్లిద్దరూ గమనించనే లేదు.

* * *

ఆ సాయంకాలం తలనెప్పిగా ఉన్నదంటూ తనగదిలో పడుకున్న కుసుమవద్దకు వచ్చింది రత్న.

"అక్కా! మరేమో...నాకు ఓ సాయం చేయవూ?" తన మామూలు ధోరణిలో అడిగింది.

ఏమిటన్నట్లు చూసింది కుసుమ.

"నాన్నగారు నన్ను పెళ్లి చేసుకోమని పంశీని అడుగుతారేమో ... నా కయితే అతన్ని చేసుకోవాలని లేదు!"

విస్మయంతో కుసుమ కళ్లు విప్పారాయి. గమనించనట్లే చెప్పింది రత్న — "నాకు

ఎం. ఎ. చదవాలని ఉంది. ఆ పైన రిసెర్చి చేయాలని ఎంతో కోరికగా ఉంది. అది కూడా అయినాక ఆలోచిస్తాను పెళ్ళి సంగతి. అక్కా ! నాన్నగారికి చెప్పి ప్రస్తుతానికి పెళ్ళి ప్రయత్నాలు వాయిదా పడేటట్లు చూడవూ? వంశీకి మరో అమ్మాయిని చూడమను ! చదువయినాక నాకు ఇంకొక సంబంధం దొరక్కపోదు !"

"రత్నా !" అప్పటికి మాట పెగిలింది కుసుమకి "ఇంత అకస్మాత్తుగా నీ అభిప్రాయం ఎందుకు మారింది ?"


"అకస్మాత్తుగా ఏమీ కాదక్కా ! చాలా రోజుల నించి ఎం. ఎ. చదవాలనే కోరికఉంది. ఆ కోరిక ఇప్పుడు బలపడింది! ప్రస్తుతానికి పెళ్ళి మీద మనసు లేదు"

కుసుమ లేచికూర్చుంది. "నీ ఇష్ట ప్రకారమే చేద్దాం రత్నా !" హఠాత్తుగా చెల్లెలిని కౌగలించుకుంది "నీవు కోరుకున్న చదువు అయిపోయినాకే చక్కటి వరుడిని వెతుకుదాం. నా రత్నానికి తగిన వరుడు ఎప్పుడయినా దొరుకుతాడు...రత్నా...అయితే నీవు వంశీని ప్రేమించలేదా ?"

ఫక్కున నవ్వింది రత్న. "వంశీని ప్రేమించటమా ? లేదక్కా! స్నేహితుడిగా అభిమానించాను. అంతే !"

"నేను నాన్నగారితో ఇప్పుడే మాట్లాడి వస్తాను!" గది బయటకు నడిచింది కుసుమ. ఆమె ముఖం ఆనందంతో వెలిగిపోవటం గమనించక పోలేదు రత్న. బల్లమీదికి తల వాలుస్తూ అనుకుంది – 'నా ప్రేమకోసం వీ యిద్దరి సుఖాన్ని కాదనే హక్కు... అంతస్వార్థం... నాకు లేవక్కా! ఈ గాయం మానదని, ఎన్నటికీ పెళ్లి చేసుకోనని నేనను కోవటంలేదు. కాని మానేదెన్నటికో !? నేనే ఒక రత్నాన్ని, నాకేం తక్కువ అనుకున్నాను. కాని రత్నం కేవలం అలంకారప్రాయం ! మనోల్లాసం కలిగించేది కుసుమ పరాగమే !'

దూరంగా కుసుమ నవ్వు, వంశీమోహన్ మాటలు వినవచ్చాయి. ఎండ, వాన కలిసి వచ్చినపుడు అగుపించే ఇంద్రధనస్సువలె, రత్న ముఖంలో కన్నీళ్ల మధ్యలోనే చిరునవ్వు విరిసింది – ఏదో తృప్తితో !




కళ్లముందే కలలు ఫలించిన రోజు

మన రాష్ట్రంలో 70 శాతానికి పైగా ప్రజలు గ్రామాల్లో నివసిస్తున్నారు. వారి ఆశలూ ఆశయాలూ, వారి సుఖాలూ సంతోషాలూ అన్నీ వారు దున్నుకొనే పొలంమీదే ఆధారపడి వున్నాయి. ఆ పొలాన్ని వారు దున్నుకొనే పద్ధతీ, దాని ఫలసాయంమీద వారికిగల హక్కు, భూస్వాముల పెత్తనాలూ ఆ ప్రజల సాంఘిక జీవితంపైనా, ఆర్థిక స్థితిగతులపైనా ఎంతగానో ప్రభావం చూపిస్తాయి. అందుచే అత్యధికశాతం ప్రజలకు సాంఘిక, ఆర్థిక న్యాయాన్ని కల్పించే ఉద్దేశంతో భూసంస్కరణల చట్టాన్ని శాసనసభ రూపొందించింది.

మన రాష్ట్రంలో యీయేడు జనవరి 1 వ తేదీనుండి భూసంస్కరణలు అమలు జరుగుతున్నాయి. 1973 వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ భూసంస్కరణల (భూకమతాల గరిష్ఠ పరిమితి) చట్టం – అంటే 1973 సంవత్సరపు 1 వ చట్టం — ఆనాటినుండి అమల్లోకి వచ్చింది.

ఈ చట్టంలోని 8 (1) వ సెక్షను ప్రకారం, 1971 జనవరి 24 వ తేదీనగానీ, తరువాతగానీ బదిలీ చేయబడిన లేక ఒక ట్రస్టు ఏర్పాటుచేయబడిన భూమితోసహా 1975 జనవరి 1 వ తేదీనాటికి 10 ఎకరాల మాగాణి లేక 25 ఎకరాల మెట్టభూమికి మించిన భూమి విస్తీర్ణం కలిగివున్న ప్రతివ్యక్తి, లేక కుటుంబ యూనిట్, ప్రకటింపబడిన తేదీలగాయతు 30 రోజులలోగా, లేక ప్రభుత్వ ప్రకటనద్వారా పొడిగింపబడిన గడువులోగా భూమి వివరాలను ట్రిబ్యునల్ ముందు ప్రకటించుకోవాలి. 1974 సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ భూసంస్కరణల (భూకమతాల గరిష్ఠ పరిమితి) నిబంధనలలో నిర్ణయించిన 1 వ ఫారం రూపంలో యీ ప్రకటన వుండాలి. ఈవిధంగా ప్రకటించే గడువును ప్రభుత్వంవారు 1975 ఏప్రిల్ 11 వ తేదీ వరకు పొడిగించారు.



24 (1) సెక్షన్ ప్రకారం ఏ వ్యక్తి అయినా ఉద్దేశపూర్వకంగా, తగిన కారణంలేకుండా యథావిధంగా తన భూకమతాల వివరాలను ప్రకటనచేయని పక్షంలో రెండేండ్లవరకు జైలుశిక్ష, లేక రెండు వేల రూపాయల జుల్మానాగానీ, లేక యీ రెండు శిక్షలుగానీ పాత్రుడవుతాడు.

భూకమతాల వివరాలు ప్రకటించవలసినవారు ఎక్కువభాగం పల్లెసీమల్లో వుండేవారుగనుక వారికి బాగా తెలియగలందులకై యీ ప్రకటన చేయబడింది.

వెంటనే, గడువులోగా, అందరూ యీ వివరాలు ప్రకటించవలసిందిగా విజ్ఞప్తి.

ఆం. ప్ర. ప్ర. సమాచార, పౌర సంబంధశాఖ, హైదరాబాదు.

DIPR /503-C3/Advt/75

అవీ - ఇవీ - అన్నీ

హోమియోపతి వైద్యునికి గౌరవం

గుడివాడలోని ప్రభుత్వ హోమియో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎమ్. కుటుంబరావుగారు రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌గారికి గౌరవ హోమియోపతి వైద్యునిగా నియమింపబడ్డారు. వీరు లోగడ 1971 లో అప్పటి రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరిగారికి కూడా గౌరవ హోమియో వైద్యునిగా నియమితులైనారు. గురురాజా ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రి సూపర్వైజింగ్ ఆఫీసర్ కూడా వీరే.

యక్ష వివాహము

కాళిదాసు మేఘదూత కావ్యమునకు స్వేచ్ఛానువాదము. కృతికర్త శ్రీ పి. విజయభూషణశర్మ. 44 పేజీలు, వెల రు. 3—50 పై. లు. ప్రతులకు: రచయిత, ఆకాశవాణి, విజయవాడ—10.

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna


త్తమ చిత్రాలను
జలు తప్పక ఆదరిస్తారు
ని ఋజువు చేసిన
హోజ్జ్వల పౌరాణిక
త్రం!
50 వ రోజు
వీనస్ మహిజా పిక్చర్స్
యశోద కృష్ణ
ఈస్ట్‌మన్ కలర్
నిర్మాత: సి.హెచ్. ప్రకాశరావు దర్శకత్వం: సి.యస్.రావు
రచన: ఆరుద్ర సంగీతం: యస్.రాజేశ్వరరావు జి.కె.రాము
నవయుగ
VEEKAY


చీరలు
DCM
TEXTILES